ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

రాజన్న సిరిసిల్ల

జిల్లా వార్తలు

శనివారం 1 జూన్ 2024

నిందితుడిని శిక్షించాలని గ్రామస్థుల ఆందోళన 8

8 ఆశావర్కర్ల జీవితాలతో ఆడుకోవద్దు

పచ్చదనానికి ప్రణాళిక..



- మారనున్న హరితహారం పేరు
- ఇందిర వనప్రభ లేదా వనమహోత్సవం
- జిల్లాలో 7.58 లక్షల మొక్కల లక్ష్యం

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

మొక్కవోనీ దీక్షగా సాగుతున్న హరితహారం ఈ సారి పేరు మార్చుకోనుంది. కాంగ్రెస్ ప్రభుత్వం వనమహోత్సవం పేరుతో లేదా ఇందిర వనప్రభగా కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు తెలుస్తోంది. 2004-2014లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో వన యజ్ఞం పేరుతో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఆ తరువాత వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం హరితహారంగా తొమ్మిది విడతలుగా కార్యక్రమాన్ని చేపట్టింది. పదో విడతలో కాంగ్రెస్ ప్రభుత్వం దిశానిర్దేశానికి అనుగుణంగానే వనమహోత్సవ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయడానికి జిల్లా అధికార యంత్రాంగం సిద్ధమయ్యింది. వర్షాకాలంలో మొక్కలు నాటి సంరక్షించడం, నర్సరీలను ఏర్పాటు చేయడం, అర్బన్ ఫారెస్ట్ పార్కుల అభివృద్ధి, రహదారులకు ఇరువైపులా మొక్కలు నాటడం వంటి కార్యక్రమాలను చేపట్టనున్నారు.

● ప్రణాళిక సిద్ధం

గ్రామీణాభివృద్ధి, అటవీ శాఖల ఆధ్వర్యంలో అన్ని శాఖలను భాగస్వాములను చేస్తూ వర్షాలు కురవడంతోనే మొక్కలు నాటడానికి ప్రణాళిక బద్ధంగా లక్ష్యాలను ఏర్పాటు చేసుకున్నారు. జిల్లాలోని 255 గ్రామ పంచాయతీలు, రెండు మున్సిపాలిటీల పరిధిలో 19 శాఖల ద్వారా 7.58 లక్షల మొక్కలు నాటాలనే లక్ష్యంగా పెట్టుకున్నారు. 9వ విడత హరితహారంలో మొక్కలు నాటడానికి 15.08 లక్షల మొక్కలు నాటేందుకు లక్ష్యం పెట్టుకొని పూర్తి చేశారు. పదోవిడత హరితహారంలో జిల్లా వ్యాప్తంగా 7.58 లక్షల మొక్కలు నాటేందుకు సిద్ధమయ్యారు.

● ఉపాధిహామీలో మొక్కల లక్ష్యం ఎక్కువే

హరితహారంలో మొక్కలు నాటడం సంరక్షణలో ఉపాధి హామీ కిందనే ఎక్కువగా లక్ష్యాన్ని పెట్టుకుంటున్నారు. 2024 - 25 సంవత్సరానికి 5 లక్షల మొక్కలు నాటే లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటి వరకు డీఆర్‌డీఏ ద్వారా 2020-21లో 28,53,745 మొక్కలు నాటగా 27,29,701 మొక్కలు బతికున్నాయి. 2021-2022లో జిల్లా ఉపాధి హామీ కింద 26,78,762 మొక్కలు నాటగా 25,51,234 మొక్కలు బతికి ఉన్నాయి. 2022-23లో 19,17,248 మొక్కలు నాటగా 18,54,541 మొక్కలు బతికి ఉన్నాయి. 2023-24లో ఉపాధిహామీ కింద 6,92,099 మొక్కలు నాటారు. ఇందులో 6,67,980 మొక్కలు బతికి ఉన్నాయి. పల్లె ప్రకృతి వనాలతోనూ పచ్చదనాన్ని పెంపొందిస్తున్నారు.

● శాఖల వారీగా లక్ష్యాలు

హరిత లక్ష్యాన్ని విజయవంతంగా పూర్తి చేయడానికి జిల్లాలో ప్రభుత్వ శాఖల వారీగా లక్ష్యాలను కేటాయించారు. ఈ సారి 7.58 లక్షల మొక్కలు నాటే లక్ష్యంలో అత్యధికంగా జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో 5 లక్షల మొక్కలు నాటే లక్ష్యంగా పెట్టుకున్నారు. సిరిసిల్ల మున్సిపాలిటీలో 50 వేలు, వేములవాడ మున్సిపాలిటీలో 20 వేలు, వ్యవసాయ శాఖలో 20 వేలు, అటవీ శాఖ లక్ష, ఎక్సైజ్ శాఖ 20 వేలు, విద్యాశాఖ 6 వేలు, ఉద్యానవన శాఖ 5 వేలు, రెవెన్యూ శాఖ వెయ్యి, ఆర్‌అండ్‌బీ శాఖ 10 వేలు, నీటి పారుదల శాఖ 10 వేలు, వైద్య ఆరోగ్య శాఖ 5 వేలు, పోలీస్ శాఖ 5 వేలు, మైనింగ్ శాఖ వెయ్యి, పౌరసరఫరాలు, పరిశ్రమలు, దేవాదాయ, సెస్, మైనార్టీ వెల్ఫేర్ శాఖలు వెయ్యి చొప్పున మొక్కలు నాటే లక్ష్యం పెట్టుకున్నారు.

● నర్సరీలో 25.79 లక్షల మొక్కల పెంపకానికి చర్యలు

జిల్లా వ్యాప్తంగా 255 గ్రామ పంచాయతీల పరిధిలో నర్సరీలు ఉన్నాయి. ప్రభుత్వ స్థలాల్లో 218 నర్సరీలు, ప్రైవేటు స్థలాల్లో 37 నర్సరీలను ఏర్పాటు చేశారు. నర్సరీల్లో 25.82 లక్షల మొక్కలను పెంచే లక్ష్యం పెట్టుకున్నారు. ఇందులో ఇప్పటికే 90 శాతం మొక్కలు సిద్ధమయ్యాయి. నర్సరీలలో ఉన్న మొక్కలను ఆయా గ్రామాల్లో నాటనున్నారు. ఇళ్లలో నాటేందుకు పూలు, పండ్ల మొక్కలను అందించనున్నారు.

దంచి కొడుతున్న ఎండలు

● 44.7డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు

సిరిసిల్ల, మే 31 (ఆంధ్రజ్యోతి): ఎండలు దంచి కొడుతున్నాయి శుక్రవారం జిల్లాలో ఉదయం నుంచే ఎండ తీవ్రత పెరిగింది. ప్రజలు బయటకు రావడానికి ఇబ్బందులు పడ్డారు. జిల్లాలో కనిష్ఠ ఉష్ణోగ్రత 36.9 డిగ్రీలు ఉండగా, గరిష్ఠ ఉష్ణోగ్రత 44.7డిగ్రీలు ఉంది. జిల్లా వ్యాప్తంగా ఆరెంజ్ అలెర్ట్ కొనసాగుతోంది. గరిష్ఠ ఉష్ణోగ్రతల్లో సిరిసిల్లలో 44.7 డిగ్రీలు, ఇల్లంతకుంట 44.3, రుద్రంగి 44.1, వేములవాడ రూరల్ 43.4, వేములవాడ 43.3, గంభీరావుపేట, బోయినపల్లి 43.3, కోనరావుపేట 42.9, వీర్నపల్లి, తంగళ్లపల్లిలో 42.7, ముస్తాబాద్ 41.9, ఎల్లారెడ్డిపేటలో 41.6 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

విద్యార్థుల సంఖ్యను పెంచాలి

ముస్తాబాద్, మే 31 : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేలా కృషి చేయాలి ముస్తాబాద్ మండల నోడల్ ఆఫీసర్ రాజిరెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో బడిబాటపై శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. బడీడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందేలా చూడాలన్నారు. పాఠశాలల్లో సమస్యలు పరిష్కారం అయ్యేలా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సురేశ్, ఏపీఎం ఆనంద్ మోహన్ పాల్గొన్నారు.

రాజన్నను దర్శించుకున్న రాష్ట్ర సర్కిల్ చీఫ్ జనరల్ పోస్టుమాస్టర్

వేములవాడ టౌన్, మే 31: వేములవాడ రాజరాజేశ్వర స్వామిని రాష్ట్ర సర్కిల్ చీఫ్ జనరల్ పోస్టు మాస్టర్ పి. విద్యాసాగర్‌రెడ్డి శుక్రవారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. రాజన్న ఆలయంలో ప్రత్యేక పూజలో పాల్గొని కోడెమొక్కు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ నాగిరెడ్డి మండపంలో అర్చకులు ఆశీర్వచనం, సూపరిండెంట్‌లు సిరిగిరి శ్రీరాములు, అల్లి శంకర్, సంకెపల్లి పవన్‌కుమార్ రాజన్న చిత్రపటాన్ని అందజేశారు.

త్వరలో అందుబాటులోకి మినీస్టేడియం



మాట్లాడుతున్న విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ రూరల్, మే 31 : వేములవాడలో మినీ స్టేడియాన్ని త్వరలోనే అందుబాటులోకి తీసుకొస్తామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. మండలంలోని చెక్కపల్లిలో లయ యూత్ 30 వార్షికోత్సవం సందర్భంగా జిల్లా ఇన్విటేషన్ కబడ్డీ పోటీలను శుక్రవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యువత చదువుతోపాటు క్రీడల్లో రాణించాలన్నారు. క్రీడలతో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని, మానసికోల్లాసం కలుగుతుందని అన్నారు. క్రీడల్లో గెలు పోటములు సహజమని, క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగాలని అన్నారు. క్రీడాకారులకు ప్రభుత్వం తరఫున ప్రోత్సాహం లభించేలా చర్యలు తీసుకుం టామన్నారు. పలువురు నాయకులు, టోర్నమెంటు నిర్వాహకులు, క్రీడాకారులు, పాల్గొన్నారు.

పొగాకు ఉత్పత్తుల వాడకాన్ని నియంత్రించాలి

సిరిసిల్ల, మే 31 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పొగాకు ఉత్పత్తుల వాడకం నియంత్రించేందుకు ప్రణాళికా బద్ధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అనురాగ్ జయంతి సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో పొగాకు వ్యతిరేక దినం నేప థ్యంలో 'పొగాకు నియంత్రణ' అనే అంశంపై సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా బహిరంగ ప్రదేశాల్లో పొగ తాగకూడదనే బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు.కలెక్టరేట్‌తో పాటు వేములవాడ ఆలయం, ఇతర ప్రభుత్వ కార్యాలయాలు, బస్టాండ్‌లలో జూన్ 15 నాటికి బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. జూన్ చివరి నాటికి జిల్లాలోని అన్ని విద్యా సంస్థల్లో పొగాకు వాడకంతో కలిగే నష్టాలను విద్యార్థులకు వివరించే విధంగా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. వ్యాస రచన, ఇతర పోటీలను నిర్వహించాలన్నారు. పొగాకు అలవాటు మానుకునేలా సహకారం అందించాలన్నారు. జిల్లాలో డీ అడిక్షన్ కేంద్రం ఏర్పాటు చేసి కేంద్రాన్ని వినియోగించుకునే విధంగా ప్రచారం కల్పించాలని ఆదేశించారు. పొగాకు ఉత్పత్తుల నిషేధ చట్టం 2003పై అవగాహన కల్పించాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

విద్యాలయాల చుట్టూ వంద గజాలలోపు పొగతాగడం, ఉత్పత్తుల అమ్మకాలు నిషేధమని, 18ఏళ్ల లోపు పిల్లలకు పొగాకు ఉత్పత్తులను విక్రయించవద్దని అన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ గౌతమి, జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుమన్‌మోహన్‌రావు, డీఈవో రమేష్, డీపీఆర్వో శ్రీధర్ పాల్గొన్నారు.

అర్బన్ బ్యాంక్ ఎన్నికల బరిలో 61 మంది

- 39 మంది ఉపసంహరణ

సిరిసిల్ల, మే 31 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల సహకార అర్బన్ బ్యాంక్ ఎన్నికల ప్రక్రియలో నామినేషన్ల ఘట్టం ముగిసింది. శుక్రవారం 12 డివిజన్లలో బరిలో నిలిచిన అభ్యర్థుల లెక్క తేలింది. 102 మంది నామినేషన్లు దాఖలు చేయగా ఇద్దరి నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. 39 మంది అభ్యర్థులు నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. 61 మంది బరిలో నిలిచారు. గతంలో కొన్ని డివిజన్లలో ఏకగ్రీవమవగా ఈ సారి తీవ్రపోటీ నెలకొంది. బరిలో నిలిచిన వారిలో 1వ డివిజన్‌లో ఆరుకాల అనందం, గజ్జెల్లి సత్యనారాయణ, గుడ్ల వెంకటేశం, నల్ల ప్రదీప్‌కుమార్, పత్తిపాక పద్మ, బూర్ల వెంకటేశం, బొల్లి రవీందర్, వేముల మురళి, రాపెల్లి లక్ష్మీనారాయణ, 2వ డివిజన్‌లో గుడ్ల సత్యానందం, భోగ శంకర్, స్వర్గం శేఖర్, 3వ డివిజన్‌లో చొప్పదండి ప్రమోద్, బొద్దుల భాస్కర్, 4వ డివిజన్‌లో అడ్డగట్ల మురళి, వేముల హన్మంతు, సూరం వినయ్, 5వ డివిజన్‌లో తుంగ శివరాజ్, పాటి కుమార్ రాజు, బానోతు నీల, మొగిలి రాజు, 6వ డివిజన్‌లో ఆడెపు చక్రపాణి, కందికట్ల సదానందం, బుర్ర రాజు, మర్రిపల్లి శశికాంత్, మ్యాన రాంప్రసాద్, వంగరి అంబదాస్, 7వ డివిజన్‌లో ప్రయాకర్‌రావు వినీల, బుర్ర జ్యోతి, వేముల సుక్కమ్మ, 8వ డివిజన్‌లో అడ్డగట్ల దేవదాస్, అవదూత నాగరాజు, కూస లక్ష్మీనారాయణ, గోరట్యాల ప్రకాష్, గంగుల రాజేందర్, రాపెల్లి శ్రీహరి, స్వర్గం రాజు, 9వ డివిజన్‌లో ఆడెపు జగదీశ్వర్, ఎనగందుల శంకర్, గాలిపెల్లి ప్రకాష్, చొప్పదండి శ్రీనివాస్, నేరెళ్ల ప్రేంకుమార్, సోమిశెట్టి దశరథం, 10వ డివిజన్‌లో ఆడెపు అనసూర్య, ఏలూరి కవిత, చీటి గీత, మచ్చ రజిత, మామిడాల లత, వరుస హరిణి, 11వ డివిజన్‌లో ఉలిసె శ్రీనివాస్, కట్ల సతీస్, కొండి సదానందం, పత్తిపాక సురేష్, ఎర్రగుంట కపిల్, 12వ డివిజన్‌లో అడిగొప్పుల పరమేష్, అడెపుసూర్య, కూస మహేష్, కోడం సంజీవ్, గుడ్ల సురేష్‌కుమార్, బూర్ల విద్యాసాగర్, మామిడాల రమణ బరిలో ఉన్నారు. పోటీలో ఉన్న అభ్యర్థులతో బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ నాయకులు ప్యానల్‌గా మార్చి మద్దతు ప్రకటించడానికి కసరత్తు చేస్తున్నారు.

పల్లెల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలి



నర్సరీని పరిశీలిస్తున్న డీపీవో వీర బుచ్చయ్య

వీర్నపల్లి, మే 31:మారుమూల అటవీ పల్లెల్లో అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా పంచాయతీ అధికారి వీరబుచ్చయ్య అన్నారు. వీర్నపల్లి మండల కేంద్రంలోని పల్లె ప్రకృతి వనం, కంపోస్ట్ షెడ్డు, వైకుంఠధామం, నర్సరీలను శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో పలు రికార్డులను తనిఖీ చేశారు. పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లెల్లో నర్సరీల పనితీరు, పల్లె ప్రకృతి వనాలు, కంపోస్ట్ షెడ్డు నిర్వహణ సరిగా ఉండాలన్నారు. రాబోయే వర్షాకాలంలో సానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ప్రతీ గ్రామంలో మురికి కాలువలు శుభ్రం చేయాలని, బ్లీచింగ్ చల్లించాలని అన్నారు. మంచినీటి ట్యాంకుల్లో క్లోరినేషన్ చేయాలని సూచించారు. పారిశుధ్య సిబ్బందితో ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. విధులపై సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఇన్‌చార్జి డీఎల్పీవో, ఎంపీవో నరేష్ కుమార్, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

● వీర్నపల్లి మండల కేంద్రంలోని కంపోస్టు షెడ్డులో తయారు చేసిన 20 కిలోల కృత్రిమ ఎరువును ఇంట్లో చెట్లకు ఉపయోగించేందుకు డీపీవో వీరబుచ్చయ్య కొనుగోలు చేశారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలి

● కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల కలెక్టరేట్, మే 31: రాబోయే వానాకాలంలో జిల్లాలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. సిరిసిల్ల కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు నియంత్రణకు చేపట్టాల్సిన చర్యలపై అదనపు కలెక్టర్ పూజారి గౌతమితో కలిసి శుక్రవారం జిల్లా స్థాయి సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అనురాగ్ జయంతి మాట్లాడుతూ వానాకాలంలో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకునేందుకు సన్నద్ధం కావాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రతీ గ్రామంలో, మున్సిపల్ వార్డులో నీటి నిల్వ ఉండే ప్రాంతాలను గుర్తించాలని, అక్కడ నీరు నిల్వ కాకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. జూన్ 7 నాటికి ప్రతీ గ్రామం, మున్సిపల్ వార్డు వారిగా నీరు నిలువ ఉండే ప్రాంతాల వివరాలు సమర్పించాలన్నారు. ప్రతీ మంగళ, శుక్రవారాల్లో డ్రైడేలో వాటర్ లాగిన్ పాయింట్ల మరమ్మతుకు ఉపాధిహామీ నిధులు వినియోగించుకోవాలని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రతీ వారం నీటి నిల్వ ప్రాంతాలను పరిశీలించాలని, నీరు అధికంగా నిలువ ఉన్న ప్రాంతాల్లో యాంటీ లార్వా స్ప్రే చేయాలని, ఆయిల్ బాల్స్ వేయాలని అధికారులకు సూచించారు. పట్టణాల్లో ఉన్న మేజర్ డ్రైయిన్లను డీసెల్టింగ్ పూర్తి చేయాలన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఉన్న మహిళా సంఘాలతో అవసరమైన మేర ఆయిల్ బాల్ తయారు చేసి సన్నద్ధం కావాలన్నారు. జిల్లాలో లోతట్టు ప్రాంతాల్లో ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. అధికంగా నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని, గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని మానేరు, మూల వాగుల ప్రవాహాలు అంతరాయం కలగకుండా సజావుగా సాగేలా చూడాలని అన్నారు. జిల్లాలో ఉన్న ప్రతీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద డెంగ్యూ రాపిడ్ టెస్ట్‌లు అవసరమైన మందులు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా కూలిపోయే స్థితిలో ఉన్న పాడైపోయిన భవనాలు, పాతబడిన భవనాలను తొలగించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. డ్రైడే కార్యక్రమం కింద నిల్వ ఉన్న నీరు తొలగించాలని, ఇంటిలో నీరు నిల్వ ఉంచుకోకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విస్తృత ప్రచారం కల్పించాలని అన్నారు. గ్రామాల్లో పట్టణాల్లో రెగ్యులర్ ఫాగింగ్ నిర్వహించాలని సూచించారు. నాలాలపై ఉన్న అక్రమ నిర్మాణాలను, కట్టడాలను తొలగించాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో జడ్పీ సీఈవో ఉమారాణి, మున్సిపల్ కమిషనర్లు లావణ్య, అవినాష్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సుమన్ మోహన్‌రావు, జిల్లా పంచాయతీ అధికారి వీర బుచ్చయ్య, ఎంపీడీవోలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

చిన్నప్పటి నుంచి

క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి

● ఎస్పీ అఖిల్ మహాజన్



విద్యార్థులతో ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్ల క్రైం, మే 31: చిన్నప్పటి నుంచి క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని, తల్లిదండ్రులు ప్రోత్సాహం ఇవ్వాలని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. శుక్రవారం రాత్రి సిరిసిల్ల పట్టణంలోని కొత్త చెరువు వద్ద బండ్ పార్కులో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సిరిసిల్ల, వేములవాడ, కోనరావుపేట, ఎల్లారెడ్డిపేటలో నిర్వహించిన వేసవి క్రీడా శిక్షణ శిబిరం ముగింపు సందర్భంగా కార్యక్రమం ఏర్పాటు చేశారు. విద్యార్థులకు ఎస్పీ సర్టిఫికెట్‌లను ప్రదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతోపాటు క్రీడల్లోనూ శిక్షణ ఇస్తే భవిష్యత్‌లో రాణిస్తారన్నారు. క్రీడల ద్వారా శారీరక దారుఢ్యంతోపాటు క్రమశిక్షణ అలవడుతుందన్నారు. జిల్లాలో యువత చెడు మార్గంలో వెళ్లకుండా ఉండేందుకు దోస్త్ మీట్ ద్వారా మండల స్థాయి క్రీడలు నిర్వహించామన్నారు. ఇందులో భాగంగానే 14 సంవత్సరాలలోపు విద్యార్థులకు ఖోఖో, వాలీబాల్, కబడ్డీ తదితర క్రీడల్లో నెల రోజులపాటు సమ్మర్ క్యాంప్ ఏర్పాటు చేసి శిక్షణను ఇచ్చామన్నారు. పాఠశాలల ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు సహకారంతో సమ్మర్ క్యాంప్ విజయవంతంగా పూర్తి చేసినట్లు చెప్పారు. నెల రోజులుగా నాలుగు క్యాంపులలో 300 మంది విద్యార్థులు వివిధ క్రీడల్లో శిక్షణ పొందారన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ చంద్రయ్య, డీఎస్పీ నాగేంద్రచారి, సీఐలు రఘుపతి, వీరప్రసాద్, వెంకటేశ్వర్లు, ఎస్సైలు అంజనేయులు, రమేష్ పాల్గొన్నారు.

● అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నెల రోజులపాటు నిర్వహించిన వేసవి క్రీడా శిక్షణ శిబిరం ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. యోగా విన్యాసాలు, కరాటే ప్రదర్శనలు, డ్యాన్స్‌లు ఆకట్టుకున్నాయి.

ఘనంగా వ్యవసాయ కళాశాల వార్షికోత్సవం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న రాజేశ్వర్‌రావు

తంగళ్లపల్లి, మే 31: తంగళ్లపల్లి మండలం జిల్లెళ్లలో స్థాపించిన బాబు జగ్జీవన్‌రామ్ వ్యవసాయ కళాశాల ద్వితీయ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా కార్యక్రమాన్ని కరీంనగర్ డెయిరీ చైర్మన్ చల్మెడ రాజేశ్వర్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్య అవసరమని, ధైర్యంతో ముందుకు సాగాలని, అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కరీంనగర్ డెయిరీ రైతులకు అన్ని రకాలుగా ఆర్థిక సాయం అందిస్తోందని, మూగజీవాలకు అంబులెన్స్ సౌకర్యం కల్పించామని అన్నారు. 65 సంవత్సరాల వయస్సు పైబడిన రైతులకు పెన్షన్ అందిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులు బాగా చదివి సమాజానికి సేవ చేయాలన్నారు. డీన్ ఆఫ్ అగ్రికల్చర్ డాక్టర్ సీమ మాట్లాడుతూ విద్యార్థులు వ్యవసాయంలో కొత్త సాంకేతికత ఉపయోగించుకొని సవాళ్లను అధిగమించాలన్నారు. ఈ సందర్భంగా కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ శ్రీదేవి కళాశాల విషయాల్ని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. వివిధ క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కుమారస్వామి, డాక్టర్ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

రాజన్నకు అంజన్న భక్తుల మొక్కులు



అంజన్న భక్తులతో కోలాహలంగా మారిన రాజన్న ఆలయం

వేములవాడ టౌన్, మే 31: వేములవాడ రాజరాజేశ్వరస్వామి క్షేత్రం శుక్రవారం కాషాయ మయమైంది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన హనుమాన్ దీక్షాపరులతో రాజన్న ఆలయం కిక్కిరిసింది. శనివారం హనుమాన్ జయంతి సందర్భంగా శుక్రవారం సాయంత్రం రాజన్న ఆలయానికి హనుమాన్ దీక్షాపరులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ ధర్మగుండంలో పవిత్రస్నానాలు ఆచరించి పార్వతిపరమేశ్వరులను దర్శించుకున్నారు. అనంతరం కోడెమొక్కులు చెల్లించుకున్నారు. మరోవైపు హనుమాన్‌భక్తుల జైశ్రీరామ్ నామస్మరణతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. రాజన్న దర్శనం చేసుకున్న అంజన్న భక్తులు సాయంత్రం తిరిగి కొండగట్టు ఆలయానికి బయల్దేరారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఈవో రామకృష్ణ నేతృత్వంలో అధికారులు ఏర్పాట్లు చేశారు.

ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచాలి

● కలెక్టర్ అనురాగ్ జయంతి

వేములవాడ టౌన్, మే 31: రైతులకు అనుగుణంగా ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచాలని కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. వేములవాడ పట్టణంలోని గ్రోమోర్ సెంటర్, శ్రీలక్ష్మీ ఎరువుల దుకాణాలను శుక్రవారం తనిఖీ చేశారు. రికార్డులు, స్టాక్ వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ముందస్తుగా స్టాక్ పెట్టుకొని రైతులకు సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటోందన్నారు. వ్యవసాయశాఖ అధికారులు సమన్వయం చేసుకుంటూ కొరత తలెత్తకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. రైతులకు సరిపోయే పత్తి విత్తనాలను అందుబాటులో ఉంచాలన్నారు. కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు విక్రయించి రైతులను మోసం చేస్తే పీడీ యాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు. జిల్లా వ్యవసాయాధికారి భాస్కర్, మండల వ్యవసాయాధికారి సాయికిరణ్ తదితరులు ఉన్నారు.

వేములవాడ రూరల్: నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలుంటాయని జిల్లా వ్యవసాయశాఖ అధికారి భాస్కర్ అన్నారు. మండలంలోని హన్మాజిపేట, వట్టెంల గ్రామాల్లో ఫర్టిలైజర్ షాపులను శుక్రవారం తనిఖీ చేశారు. విత్తనాల విక్రయాలకు సంబంధించిన వివరాలను నమోదు చేయాలన్నారు. షాపులలోని రికార్డులను పరిశీలించారు.

ముస్తాబాద్: మండలంలోని పలు ఎరువుల దుకాణాలను వ్యవసాయ అధికారి వెంకటేశ్ ఆధ్వర్యంలో తనిఖీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఆమోదం పొందిన విత్తనాలను మాత్రమే రైతులకు విక్రయించాలని సూచించారు. కాలం చెల్లిన విత్తనాలను అమ్మకూడదని, నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.



వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

● మండలంలోని నామాపూర్, బందనకల్, రామలక్ష్మణపల్లె, నిమ్మలవారిపల్లె, గన్నెవానిపల్లె తదితర గ్రామాల్లో రైతులకు ఎరువులు, విత్తనాలపై వ్యవసాయాధికారులు అవగాహన కల్పించారు. విత్తనాల కొనుగోలులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. డీలర్ల వద్దనే కొనుగోలు చేయాలని విత్తనాలు కొనుగోలు చేసినప్పుడు తప్పనిసరిగా రసీదులు తీసుకోవాలని అన్నారు. పంట కాలం పూర్తయ్యే వరకు రసీదులు భద్రపర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు శ్రీలత, ప్రదీప్, సౌమ్య, అఖిల తదితరులు పాల్గొన్నారు.



వడదెబ్బతో ముగ్గురి మృతి

చొప్పదండి, మే 31: చొప్పదండి, వీణవంక మండలాల్లో, పెద్దపల్లి జిల్లా ఎన్టీపీసీలో వడ దెబ్బతో ముగ్గురు మృతి చెందారు. మధ్యప్రదేశ్‌కు చెందిన జాకీర్ హుస్సేన్(60) పెద్దపల్లి జిల్లా బసంత్‌నగర్‌లోని సిమెంట్ ఫ్యాక్టరీలో లారీ డ్రైవర్‌గా పనిచే స్తున్నాడు. శుక్రవారం సిమెంట్ బస్తాల లోడ్‌తో లారీని చొప్పదండికి తీసుకురాగా రహదారి పక్కన నిలిపి మంచినీరు తాగి లారీ వద్ద ఒరిగిపోయాడు. గమనించిన స్థానికులు పోలీసుల కు సమాచారం అందించగా లారీ నంబర్ ఆధారంగా మృతుడి వివరాలను తెలుసుకున్నారు. కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వీణవంక: మండల కేంద్రానికి చెందిన కళ్యాణం రామక్క (75) వడ దెబ్బతో శుక్రవారం సాయంత్రం మృతి చెందింది. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం రెండు రోజులుగా ఎండ వేడి తీవ్రంగా ఉండడంతో పాటు వేడి గాలి వీయడంతో వడ దెబ్బకు గురై మృతి చెందింది. మృతురాలు రామక్కకు ఇద్దరు కొడుకులు, నలుగురు కూమార్తెలు ఉన్నారు.

జ్యోతినగర్: పెద్దపల్లి జిల్లా ఎన్టీపీసీ మేడిపల్లి సెంటర్‌కు చెందిన ఈదునూరి కిషోర్(34) శుక్రవారం వడదెబ్బతో మృతిచెందాడు. హనుమాన్ మాల ధరించిన కిషోర్ తోటి భక్తులతో కలిసి ఉదయం పాదయాత్రగా జగిత్యాల జిల్లా కొండగట్టుకు బయలుదేరాడు. ఎండవేడి తట్టుకోలేక సొమ్మసిల్లి పడిపోయాడు. అతడిని గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా రాత్రి చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడు ఎన్టీపీసీలో కాంట్రాక్టు కార్మికుడిగా విధులు నిర్వహిస్తున్నాడు.

బైక్ అదుపుతప్పి ఒకరికి గాయాలు

కోనరావుపేట, మే 31: కోనరావుపేట మండలం నాగారం మర్తనపేట గ్రామాల మధ్యలో బైక్ అదుపుతప్పి ఒకరికి గాయాలు కాగా గ్రామస్థులు జిల్లా ఆస్పత్రికి తరలించారు. వేములవాడ మండలం మారుపాకకు చెందిన మోడిక రవి తన బైక్‌పై మారుపాకకు వస్తుండగా నాగారం-మర్తన్ పేట గ్రామాల మధ్యలో బైక్ అదుపుతప్పి కింద పడిపోయాడు. గాయాలైన రవిని మర్తన్‌పేట మాజీ సర్పంచ్ వంశీ, లింగాల సత్తయ్య గమనించి 108 అంబులెన్స్‌కు ఫోన్ చేసి ఆస్పత్రికి తరలించారు.

అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న లారీ

- విరిగిపడిన కరెంట్ పోల్
- షార్ట్ సర్క్యూట్‌తో కాలిపోయిన టీవీలు, రిఫ్రిజిరేటర్లు



గొల్లపల్లిలో విద్యుత్ స్తంభాన్ని ఢీ కొన్న లారీ

తిమ్మాపూర్, మే 31: మండలంలోని గొల్లపల్లి గ్రామంలో ఓ లారీ విద్యుత్ పోల్‌ను ఢీ కొట్టడంతో స్తంభం విరిగింది. గ్రామస్థుల కథనం ప్రకారం ఓ లారీ గొల్లపల్లి నుంచి గుండ్లపల్లి వెళుతున్న క్రమంలో లారీ డ్రైవర్ మద్యం మత్తులో నడుపుకుంటూ వచ్చి రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ పోల్‌ను లారీతో ఢీకొట్టాడు. దీంతో స్తంభం విరిగి పడి రోడ్డుపై పడిపోయింది. దీంతో గ్రామంలో ఒక్కసారిగా విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరగడంతో పలు ఇళ్లలో టీవీలు, రిఫ్రిజిరేటర్లు, ఇతర పరికరాలు కాలిపోయాయి. గ్రామస్థులు గమనించి రోడ్డుపై ఉన్న లారీని అడ్డుకున్నారు. డ్రైవర్ అక్కడినుంచి తప్పించుకొని పారిపోయాడు. లారీ డ్రైవర్ మద్యం మత్తులో డ్రైవింగ్ చేయడం వల్లే ప్రమాదం జరిగిందని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. రేణికుంట వద్ద రాజీవ్‌రహదారిపై ఉన్న టోల్ గేటును తప్పించుకునేందుకు గ్రామాల నుంచి లారీలు వెళుతుండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయని గ్రామస్థులు అంటున్నారు.



విరిగిన విద్యుత్ స్తంభం

ఆత్మహత్యాయత్నం చేసిన ట్రాక్టర్ డ్రైవర్ మృతి

ముస్తాబాద్, మే 31: మండలంలోని నామాపూర్ గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. గ్రామస్థు లు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నామాపూర్‌కు చెందిన తలారి బుచ్చయ్య(45) అనే ట్రాక్టర్ డ్రైవర్ కుటుంబ కలహాలు, ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపం చెంది రెండు రోజుల క్రితం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు సిరిసిల్లలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు వరంగల్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మరణించాడు. మృతుడు బుచ్చయ్యకు భార్య లక్ష్మి, ఇద్దరు కూతుర్లు ఉన్నారు.

రైతును బెదిరించిన ఇద్దరి అరెస్ట్

చందుర్తి, మే 31: భూమిని చదును చేసుకుంటున్న ఓ రైతు బెదిరింపులకు పాల్పడిన వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు చందుర్తి ఎస్ఐ శ్రీకాంత్ శుక్రవారం తెలిపారు. కథనం ప్రకారం మండలం లింగంపేట గ్రామా నికి చెందిన కమటం లక్ష్మీరాజం అనే రైతు గత నెల 23 తెల్లవారుజామున భూమిని ఎక్స్‌కవేటర్, ట్రాక్టర్లతో భూమిని చదును చేయిస్తున్నాడు. వేములవా డ పట్టణానికి చెందిన కొలగాని చందు, ఖమ్మం రమాకాంత్ అనే ఇద్దరు వ్యక్తులతో పాటు ఇద్దరు వ్యక్తులు వ్యవసాయ భూమిని చదును చేస్తున్న రైతు వద్దకు వెళ్లి మైనింగ్ శాఖ అధికారుల అనుమతులు ఉన్నాయా అంటూ బెదిరింపులకు పాల్పడి, రూ. 40 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీంతో బాధిత రైతు ఫిర్యాదు మేరకు ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్ పంపామన్నారు. లింగంపేటకు చెందిన మరో ఇద్దరు పరారీలో ఉన్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.











తెలంగాణ బలి దేవత కాంగ్రెస్సే

- వందలాది మంది అమరులయ్యింది ఆ పార్టీ వల్లే...
- అమరుల స్థూపం ఎవరి వల్ల నిర్మించాల్సి వచ్చింది?
- కాంగ్రెస్ పదేళ్ల తాత్సారం వల్లే కదా బలి దానాలు: కేటీఆర్



హైదరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణలో వందలాది మంది అమరులయ్యింది ఎవరి వల్ల? అమరుల స్థూపం ఎవరి వల్ల నిర్మించాల్సి వచ్చింది.. గతంలో రేవంత్‌రెడ్డి చెప్పినట్లు తెలంగాణ బిడ్డల్ని చంపిన బలి దేవత ఎవరు...? అంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె. తారక రామారావు ప్రశ్నించారు. 'ఎక్స్' వేదికగా కాంగ్రెస్‌ను ఆయన శుక్రవారం విమర్శించారు. 1952లోనే ఉమ్మడి రాష్ట్రం వద్దని, హైదరాబాద్ ప్రత్యేక రాష్ట్రంగానే ఉండాలని పోరాటం చేస్తున్న విద్యార్థులపై సిటీ కాలేజీ వద్ద కాల్పులు జరిపి ఆరుగురిని బలిగొన్నది, 1969-71 తొలిదశ ఉద్యమంలో 370 మంది తెలంగాణ బిడ్డల్ని కాల్చి చంపింది అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం కాదా..? అని నిలదీశారు. 1971 పార్లమెంట్ ఎన్నికల్లో 11/14 సీట్లలో తెలంగాణ ప్రజా సమితి పార్టీని గెలిపిస్తే ఆ పార్టీని మాయం చేసింది, దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రజాస్వామికంగా తమ ఆకాంక్షను వ్యక్తం చేస్తే, తెలంగాణను తుంగలో తొక్కింది కాంగ్రెస్ ప్రభుత్వమేనన్నారు. 2004లో మాట ఇచ్చి, పదేళ్లు తాత్సారం చేసి వందలాది మంది తెలంగాణ బిడ్డలు ఆత్మ బలి దానం చేసుకునే దుస్థితికి కారణమైంది అప్పుడు కేంద్రంలో ఉన్న కాంగ్రెస్సేనని కేటీఆర్ ఆరోపించారు.

తెలంగాణ తేజం పాటను ఆవిష్కరించిన కేసీఆర్

హైదరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ తేజం పేరిట కేసీఆర్(కేశవ చంద్ర రమావత్) సినిమా కోసం రూపొందించిన పాటను మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆవిష్కరించారు. నటుడు రాకింగ్ రాకేష్ నిర్మించిన కేసీఆర్ సినిమాలోని ఆ పాటను శుక్రవారం నంది నగర్‌లోని కేసీఆర్ నివాసంలో జరిగిన ఆవిష్కరణ కార్యక్రమంలో ఎంపీ డి.దామోదర్ రావు, ఎమ్మెల్సీలు దేశపతి శ్రీనివాస్, మధుసూదనాచారి, సంగీత దర్శకుడు చరణ్ అర్జున్, యాంకర్ జోర్దార్ సుజాత, సింగర్ విహ, గీత రచయిత సంజయ్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు బీఆర్ఎస్ ర్యాలీ

హైదరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో భాగంగా బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో శనివారం ర్యాలీ జరగనుంది. రాష్ట్ర అవతరణ వేడుకలను బీఆర్ఎస్ పార్టీ మూడు రోజులు పాటు నిర్వహించాలని నిర్ణయించుకుంది. ఇందులో భాగంగా శనివారం సాయంత్రం పబ్లిక్ గార్డెన్స్ నుంచి అసెంబ్లీ ఎదుట ఉన్న అమరవీరుల స్థూపం వరకు ర్యాలీ నిర్వహించనున్నారు. ఈ ర్యాలీలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావుతోపాటు ఆ పార్టీకి చెందిన ముఖ్య నేతలంతా పాల్గొంటారు.

ట్యాపింగ్ వ్యవహారంలో కేసీఆర్‌పై దుష్ప్రచారం

- టీవీ, యూట్యూబ్ చానళ్లపై పోలీసులకు బీఆర్ఎస్ ఫిర్యాదు

బంజారాహిల్స్, మే 31 (ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్‌లో మాజీ సీఎం కేసీఆర్ పాత్ర లేకపోయినప్పటికీ కొన్ని టీవీ, యూట్యూబ్ చానళ్లు ఉద్దేశ్య పూర్వకంగా ఆయన పేరును బదనాం చేస్తున్నాయంటూ బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్కసుమన్ పార్టీ నేతలతో కలిసి శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటి ప్రభుత్వం కోరినట్టు ఇంటెలిజెన్స్ ఇతర విభాగాల అధికారులు నివేదికలు ఇచ్చారు తప్పితే ఫోన్ ట్యాపింగ్ విషయంలో కేసీఆర్ పాత్ర ఉన్నట్టు ఎక్కడా నిర్ధారణ కాలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. అరెస్టయిన పోలీసు అధికారులు వాంగ్మూలం ఇచ్చారంటూ కేసీఆర్‌ను లక్ష్యంగా చేసుకొని కొన్ని టీవీ, యూట్యూబ్ చానళ్లు కేసీఆర్ పరువు ప్రతిష్ఠలకు భంగం కలిగించేలా విష ప్రచారం నిర్వహిస్తున్నాయని ఆరోపించారు. వాటిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీ మ్యాచ్ ఫిక్సింగ్

- ప్రజా సమస్యలు వదిలి.. ఫోన్ ట్యాపింగ్‌పై బీజేపీ దీక్షలా?
- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

హైదరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీలు మ్యాచ్ ఫిక్సింగ్ రాజకీయాలు చేస్తున్నాయని.. దేశంలో శత్రువులుగా ఉంటున్న ఆ రెండు పార్టీలు తెలంగాణలో మిత్రులుగా వ్యవహరిస్తున్నాయని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఆరోపించారు. ఫోన్ ట్యాపింగ్‌పై బీజేపీ దీక్ష చేపట్టడంపై శుక్రవారం ఆయన స్పందించారు. రాష్ట్రంలో ప్రజా సమస్యలను పట్టించుకోకుండా ఫోన్‌ట్యాపింగ్‌పై దీక్ష చేయడం వెనుక ఉద్దేశం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఈ వ్యవహారంలో చట్టం తన పని తాను చేసుకుపోతుందని, విపక్ష నాయకుల ఫోన్ల మీద కేంద్రం పెగాసస్ వాడిందన్న ఆరోపణలపై విచారణకు ఎందుకు డిమాండ్ చేయలేదో రాష్ట్ర బీజేపీ నాయకులు చెప్పాలన్నారు.

రాష్ట్రాన్ని లూటీ చేసేందుకే నకిలీ మద్యం: క్రిశాంక్

హైదరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి): మధ్యప్రదేశ్‌లో నకిలీ మద్యం అమ్ముతున్నారని సీజ్ చేసిన సోమ్ డిస్టిల్లరీస్ కంపెనీని రాష్ట్రాన్ని లూటీ చేసేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం ఇక్కడకు తెస్తోందని బీఆర్ఎస్‌నేత మన్నె క్రిశాంక్ ఆరోపించారు. మధ్యప్రదేశ్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ విభాగానికి ఈ బీరు కంపెనీ.. రూ.575 కోట్ల రుణాన్ని ఎగవేసిందని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, సంబంధిత శాఖ వాస్తవాలు తెలుసుకోకుండా అటువంటి సంస్థకు ఎలా అనుమతిచ్చారని మంత్రి జూపల్లిని ప్రశ్నించారు.

గ్రూప్-1 ప్రిలిమ్స్ వాయిదా వేయండి: ఆర్ఎస్పీ

హైదరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష ఈ నెల 9న నిర్వహించొద్దని, ఆ పరీక్షను వాయిదా వేయాలని ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ నేత ఆర్.ఎస్ ప్రవీణ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. అదేరోజు ఇంటెలిజెన్స్ బ్యూరో (ఐబీ) పరీక్ష కూడా ఉందని, చాలా మంది నిరుద్యోగులు ఐబీ పరీక్ష రాస్తున్నారని, ఎన్నికల కారణంగా పలువురు ప్రభుత్వ ఉద్యోగులు గ్రూప్-1 ప్రిలిమ్స్‌కు సన్నద్ధం కాలేదని తెలిపారు. ఈ అంశాలను దృష్టిలో ఉంచుకొని పరీక్షను నెలరోజులు వాయిదా వేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన కోరారు.

జోరుగా నిషేధిత బీటీ పత్తి విత్తనాల విక్రయాలు

- రెండు ముఠాలకు చెందిన ఐదుగురి అరెస్ట్



మహేశ్వరం ఎస్‌వోటీ పోలీసులు స్వాధీనం చేసుకున్న నిషేధిత పత్తివిత్తనాలు

హైదరాబాద్ సిటీ, మే 31 (ఆంధ్రజ్యోతి): నిషేధిత బీటీ పత్తివిత్తనాలను విక్రయిస్తున్న రెండు ముఠాలకు చెందిన ఐదుగురిని మహేశ్వరం ఎస్‌వోటీ పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. వారి నుంచి సుమారు 1000 కిలోల బీటీ పత్తివిత్తనాలను స్వాధీనం చేసుకున్నారు. నిషేధిత పత్తివిత్తనాల రవాణా జరుగుతోందన్న సమాచారంతో మహేశ్వరం ఎస్‌వోటీ, మాడ్గుల్ పోలీసులు కలిసి బ్రహ్మంపల్లి గ్రామం వద్ద నిఘా పెట్టారు. కారులో నిషేధిత పత్తి విత్తనాలు తరలిస్తున్న రంగారెడ్డి జిల్లా మాడ్గుల మండలం కొత్త బ్రాహ్మణపల్లికి చెందిన దుగ్గిపూడి మారెడ్డి (58), అల్లం వినోద్ కుమార్ (42), అల్లం మారెడ్డిని అరెస్ట్ చేశారు. మరో ఘటనలో నాచారంలోని వైష్ణవి అగ్రిటెక్ సంస్థలో పనిచేస్తున్న షాద్‌నగర్‌కు చెందిన ఎర్రదొడ్డి నల్లపారెడ్డి సత్యపాల్‌రెడ్డి (52), కేశంపేటకు చెందిన అన్నపురెడ్డి మల్లారెడ్డి (44)ని అరెస్ట్ చేసి.. వారి నుంచి నిషేధిత పత్తి విత్తనాలు స్వాధీనం చేసుకున్నారు. రెండు ముఠాలకు చెందిన ఐదుగురిని అరెస్ట్ చేసి, వారి నుంచి సుమారు వేయి కిలోల నిషేధిత పత్తివిత్తనాలు, 5 ఫోన్లు, వేయింగ్ మిషన్, ఓ కారును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

నేడు గవర్నర్‌ను కలవనునన్న సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేడు(శనివారం) కలవనున్నారు. ఉదయం 10 గంటలకు రాజ్‌భవన్‌కు వెళ్లి... గవర్నర్‌తో సమావేశం కానున్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో పాల్గొనాలని గవర్నర్‌ను సీఎం ఆహ్వానించనున్నారు. కాగా, మహారాష్ట్రలో రుణమాఫీ పథకం అమలు ఎలా జరిగిందనే విషయంపై అధ్యయనానికి రాష్ట్రం నుంచి మహారాష్ట్ర వెళ్లిన అధికారుల బృందం రాష్ట్ర ప్రభుత్వానికి త్వరలో నివేదిక ఇవ్వనుంది.

ట్యాపింగ్ కేసును సీబీఐకి ఇవ్వాలి



(మొదటిపేజీ తరువాయి)

కేసీఆర్‌తో లోపాయికారీ ఒప్పందం చేసుకుందా..? కేసీఆర్‌పై చర్య తీసుకోకపోవడానికి కారణమేంటి..? ప్రజలకు రేవంత్ సమాధానం చెప్పాలి" అని లక్ష్మణ్ డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో రూ.లక్ష కోట్ల అవినీతి జరిగిందని, దానిని కక్కిస్తామని ఎన్నికల ముందు చెప్పిన రేవంత్.. ఇప్పుడు ఎందుకు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారో సమాధానం చెప్పాలని నిలదీశారు. ఫోన్ ట్యాపింగ్‌తో బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంత దిగజారుడు రాజకీయాలకు పాల్పడిందో జైల్లో ఉన్న పోలీసు అధికారుల నేరాంగీకార పత్రాలను పరిశీలిస్తే అర్థమవుతోందని లక్ష్మణ్ అన్నారు. ఫోన్ ట్యాపింగ్‌తో వ్యాపారులను హింసించి డబ్బులు వసూలుచేశారని మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. ఫోన్ ట్యాపింగ్ సూత్రధారులపై కఠిన చర్యలు తీసుకోవాలని, బీఎల్ సంతోష్‌పై పెట్టిన కేసులను పరిశీలించాలని మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్ డిమాండ్ చేశారు.

రూ.2,000 కోట్లు అప్పు తీసుకోనున్న రాష్ట్రం

హైదరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.2,000 కోట్లు అప్పు తీసుకోనుంది. ఈ మేరకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు శుక్రవారం ఇండెంట్ పెట్టింది. 16 ఏళ్ల కాల పరిమితితో రూ.1,000 కోట్లు, 19 ఏళ్ల కాల పరిమితితో మరో రూ.1,000 కోట్లను రుణంగా తీసుకోనుంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రూ.4,000 కోట్ల అప్పు కోసం ఇండెంట్ పెట్టింది. తెలుగు రాష్ట్రాలు సహా దేశంలోని 11 రాష్ట్రాలు రూ.19,500 కోట్ల అప్పుల కోసం ఆర్‌బీఐని ఆశ్రయించాయి. జూన్ 4న జరిగే ఈ-వేలం ద్వారా ఈ అప్పులు తీసుకోనున్నాయి.

కేసీఆర్‌ను కాపాడేందుకే బీజేపీ నేతల ధర్నాలు

- అందుకే సీబీఐ విచారణ కోరుతున్నరు: ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



హైదరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్ కేసులో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను కాపాడేందుకే ఆ పార్టీ మిత్రపక్షమైన బీజేపీ.. సీబీఐ విచారణ కోరుతోందని కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఆరోపించారు. ఈ కేసును సీబీఐకి అప్పగించాలంటూ బీజేపీ నిరసన చేపట్టడం చూస్తుంటే ఆశ్చర్యం కలుగుతోందన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి కొమ్ము కాసినందుకు ప్రతిఫలంగా కేసీఆర్‌ను కాపాడాలని ఆ పార్టీ చూస్తోందన్నారు. ట్యాపింగ్ కేసు నుంచి కేసీఆర్‌ను కాపాడడం ఎవరి తరమూ కాదన్నారు. ఎమ్మెల్యేల కొనుగోలు కేసులో బీఎల్ సంతోష్‌ను ఇరికించారని చెబుతున్న బీజేపీ.. దాన్ని ఎందుకు నిరూపించలేకపోయిందన్నారు. బీఆర్ఎస్‌ను బీజేపీ అనుబంధ సంస్థగా మార్చేశారనిఎద్దేవా చేశారు. ట్యాపింగ్ కేసులో కేసీఆర్, కేటీఆర్‌లను కాపాడేందుకే బీజేపీ నేతలు ధర్నాలు చేస్తున్నారని కాంగ్రెస్ ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ఆరోపించారు. ఫోన్ ట్యాపింగ్‌పై టీపీసీసీ అధ్యక్షుని హోదాలో రేవంత్‌రెడ్డి.. అప్పట్లోనే కేంద్రానికి ఫిర్యాదు చేశారని గుర్తుచేశారు. అసలు మోదీ ప్రభుత్వమే ఫోన్ ట్యాపింగ్‌లు చేస్తుందన్న ఆరోపణలూ ఉన్నాయన్నారు. ముందు ఆ ఆరోపణలపై సీబీఐ విచారణ చేయించుకోవాలని హితవు పలికారు.

అక్టోబరులో స్థానిక ఎన్నికలు!

ఒకేసారి పంచాయతీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు.. రుణమాఫీ పూర్తయ్యాకే నిర్వహించే అవకాశం

- అప్పటికి బీసీ రిజర్వేషన్లూ కొలిక్కి తెచ్చే కసరత్తు



హైదరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి): పంచాయతీలతోపాటు ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలకూ ఒకే సారి ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. రుణమాఫీ ప్రక్రియను పూర్తి చేయడంతోపాటు బీసీ రిజర్వేషన్ల అంశం తేలాకే ఈ ఎన్నికలకు వెళ్లాలన్న యోచనలో సర్కారు ఉన్నట్లు తెలిసింది. వాస్తవానికి లోక్‌సభ ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత జూన్‌లో పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అయితే, బీసీ రిజర్వేషన్ల విషయం తేలకపోవడం, కులగణనకు ఇంకా సమయం పట్టే అవకాశం ఉండడంతో తర్జనభర్జన పడుతోంది. కులగణన వివరాల ప్రకారం కాకుండా.. కేవలం ఓటరు జాబితాలో పేర్కొన్న కులాల వారీగా రిజర్వేషన్లను లెక్కగట్టి ఎన్నికలకు వెళ్తే.. కోర్టుల్లో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని అంచనా వేస్తోంది. మరోవైపు ఆగస్టు 15లోపు రుణమాఫీ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. రుణమాఫీ పూర్తయితే ప్రజల్లో సానుకూలత పెరుగుతుందని ఆ పార్టీ భావిస్తోంది. అప్పటిలోగా కులగణనపైనా స్పష్టత వస్తుందని, అక్టోబరులో ఎన్నికలను నిర్వహిస్తే బాగుంటుందనే ఆలోచనలో ప్రభుత్వం ఉంది.

రిజర్వేషన్ల ఖరారుపై సమాలోచన

రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలంటే ముందుగా బీసీ రిజర్వేషన్లను ఖరారు చేయాల్సి ఉంది. ప్రస్తుతం స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీలకు జనాభా దామాషా ప్రకారం రాజ్యాంగబద్ధంగా రిజర్వేషన్లను కల్పిస్తున్నారు. బీసీలకు మాత్రం ఆయా రాష్ట్రాలు వాటి విచక్షణ మేరకు రిజర్వేషన్లు కల్పిస్తూ ఎన్నికలను జరుపుతున్నాయి. స్థానిక ఎన్నికల్లో బీసీ జనాభా దామాషా మేరకు రిజర్వేషన్లను పెంచాలనే డిమాండ్ కొన్నేళ్లుగా ఉంది. అయితే, రిజర్వేషన్లు 50శాతం కంటే మించకూడదని గతంలో సుప్రీం కోర్టు స్పష్టమైన ఆదేశాలను జారీచేసింది. దీంతో ఎస్సీ, ఎస్టీలకు రాజ్యాంగబద్ధ విధానంలో జనాభా దామాషా ప్రకారం పోగా.. మిగిలింది బీసీలకు కేటాయించాల్సి రావడమే సమస్యగా పరిణమించింది. ఈ విధానం కోసమైతే ఓటరు జాబితాను పరిశీలించి, వివరాలు సేకరిస్తే రిజర్వేషన్లను నిర్ణయించవచ్చు. అయితే, అప్పుడు తమకు రిజర్వేషన్ తగ్గిందనే అంశంపై బీసీలు సహా ఎవరైనా కోర్టుకు వెళ్తే మొత్తం ఎన్నికలపైనా ప్రభావం చూపే అవకాశం ఉంది. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లను 34 నుంచి 23 శాతానికి తగ్గించింది. ఇదే విధానంలో 2019లో స్థానిక ఎన్నికలను నిర్వహించింది. అప్పుడు కొంతమంది కోర్టుకు వెళ్లడంతో.. ఆ ప్రభుత్వాన్ని కోర్టు ఈ విధానంలో ఎందుకు వెళ్లారంటూ మందలించింది. ఈ ఒక్కసారికి అనుమతించాలని, తరువాత నిర్వహించబోయే ఎన్నికలకు రిజర్వేషన్లను తేల్చి, దాని ప్రకారమే నిర్వహిస్తామని గత ప్రభుత్వం కోర్టుకు చెప్పింది. కానీ, ఆతర్వాత ఇందుకు అవసరమైన చర్యలను తీసుకోకపోవడం ప్రస్తుత ప్రభుత్వానికి సమస్యగా మారింది. మరోవైపు.. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఖరారు చేయాల్సిన బీసీ రిజర్వేషన్ల అంశంపై సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటైన వకుళాభరణం కృష్ణమోహన్ నేతృత్వంలోని పూర్తిస్థాయి డెడికేటెడ్ కమిషన్ (బీసీ కమిషన్) కృషి చేస్తోంది. కుల సంఘాలతో పాటు, నిపుణులు, ప్రొఫెసర్లతో వరుస సమావేశాలను జరుపుతోంది. రాష్ట్రంలో ఎన్నికల కోడ్ ముగియగానే ఇందుకు సంబంధించిన పలు అంశాలను సీఎంతోనూ చర్చించి, ఒక నివేదికను సిద్ధం చేయనున్నట్టు సమాచారం. కాగా, ఆగస్టులో ప్రస్తుత బీసీ కమిషన్ పదవీకాలం ముగియనుంది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఈ కమిషన్‌నే కొనసాగిస్తుందా, లేక కొత్త కమిషన్‌ను నియమిస్తుందా అన్నది తెలియాల్సి ఉంది.

ఒకే సారి నిర్వహిస్తే...

సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు మూడు దఫాల్లో నిర్వహిస్తే.. మూడుసార్లు ఎన్నికల కోడ్ అమల్లో ఉంటుంది. ఇప్పటికే రాష్ట్రంలో గత ఏడాది అక్టోబరు నుంచి ఇప్పటి వరకు ఏదో ఒక ఎన్నిక జరుగుతుండగా.. నెలలపాటు కోడ్ అమల్లో ఉంది. దీంతో ప్రభుత్వ పనులు ఆలస్యమవడంతో పాటు, సామాన్య జనానికి కొంత ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఈ పరిస్థితి మళ్లీ పునరావృతం కాకూడదంటే పంచాయతీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు ఒకే సారి నిర్వహించాలన్న యోచనలో ప్రభుత్వం ఉంది. ఈ మూడు ఎన్నికలకు రిజర్వేషన్ల అంశం ముడిపడి ఉన్నాయని, జూన్ నుంచి ఆగస్టు వరకు సమయం ఉంటే ఈ అంశాన్ని తేల్చేసే అవకాశం ఉంటుందని సర్కారు భావిస్తోంది. ఎవరికీ ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఎన్నికలను నిర్వహించాలన్న ఆలోచనలోనే సీఎం రేవంత్‌రెడ్డి ఉన్నట్టు సమాచారం. ఈ మేరకు రిజర్వేషన్ల అంశం కొలిక్కి వస్తే.. సెప్టెంబరు లేదా అక్టోబరులో మూడు ఎన్నికలతో గ్రామీణ ప్రాంతాల్లో తీన్ మార్ మోగనుంది.

రూపు మారనున్న మాతా శిశు సంరక్షణ పథకం

కేసీఆర్ కిట్ ఔట్.. ఎంసీహెచ్ కిట్ ఇన్

హైదరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి): మాతాశిశు సంరక్షణకు గత ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన కేసీఆర్ కిట్ పేరును ఇప్పటికే రేవంత్ సర్కారు తొలగించింది. దాని స్థానంలో మదర్ అండ్ చైల్డ్ హెల్త్(ఎంసీహెచ్) కిట్ పేరుతో అమలు చేస్తోంది. అంతేకాక ఈ పథకం రూపురేఖల్ని పూర్తిగా మార్చేయబోతోంది. ప్రధానంగా దీన్ని ఎలా నిర్వహించాలన్న దానిపై కసరత్తు ప్రారంభించింది. పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వ నిధులతో పథకాన్ని నడపాలా? లేక కేంద్రం ఇచ్చే ప్రధాన మంత్రి మాతృవందన యోజన(పీఎంఎంవీవై)తో కలిపి కొనసాగించాలా అన్నదానిపై చర్చిస్తున్నారు. ఈ పథకంపై ఇటీవలే వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సమీక్ష నిర్వహించారు. ఎన్నికల కోడ్ కారణంగా దీనిపై ఇంకా ఏ నిర్ణయం తీసుకోలేదని తెలుస్తోంది. కోడ్ ముగియగానే కేంద్రం భాగస్వామ్యంతోనా... లేక రాష్ట్ర ప్రభుత్వ నిధులతో దీన్ని నిర్వహిస్తారా అన్న దానిపై స్పష్టత రానుంది.

రాష్ట్ర ప్రభుత్వంపై భారం తగ్గే ఛాన్స్

ప్రస్తుతం పీఎంఎంవీవై కింద కేంద్రం గర్భిణులకు రూ.6 వేల ఆర్థిక సాయాన్ని ఇస్తోంది. కేంద్రం ఇచ్చే నిధులను తీసుకొని.. దానికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున కొంత జమ చేస్తే... పాత పద్ధతిలోనే ఎంసీహెచ్ కిట్ కింద రూ. 13 వేలు ఇవ్వవచ్చు. కేంద్ర ప్రభుత్వ పథకంతో కలిపి అమలుచేయడం వల్ల రేవంత్ సర్కారుపై ఆర్థిక భారం కూడా సగానికిపైగా తగ్గుతుంది. ఇదే విషయాన్ని అధికారులు మంత్రికి వివరించినట్లు తెలుస్తోంది. కాకపోతే కేంద్రం నిధులను ఈ పథకం కింద వినియోగిస్తే... కచ్చితంగా పేరు, బ్రాండింగ్‌లో వారి నియమ నిబంధనలను పాటించాల్సివుంటుందని అధికారులు మంత్రి దృష్టికి తీసుకువచ్చినట్లు తెలుస్తోంది. దీంతో రెండు రకాల ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, జూన్ 4 తర్వాత తుది నిర్ణయం తీసుకుందామని అధికారులకు మంత్రి సూచించినట్టు చెప్తున్నారు.

తెలంగాణ చిహ్నంలో అమరుల స్థూపం పెడితే.. మీకెందుకు బాధ?

- కీరవాణికి ఆస్కార్ వచ్చినప్పుడు.. కేసీఆర్, కేటీఆర్ అభినందించలేదా?
- మహేష్ కుమార్ గౌడ్
- సమ్మక్క సారలమ్మలను చంపింది కాకతీయరాజులు కాదా?: బెల్లయ్యనాయక్

హైదరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి): "ఉద్యమకారుల అభిప్రాయం మేరకు తెలంగాణ చిహ్నంలో అమరవీరుల స్థూపం పెడితే మీకెందుకు కడుపు నొప్పి?" అంటూ బీఆర్ఎస్ నేతలను టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ ప్రశ్నించారు. నిజమైన తెలంగాణ వాదులు కోరుకున్న దిశగా కాంగ్రెస్ ప్రభుత్వ అడుగులు పడుతుంటే.. కేసీఆర్ కుటుంబం నానా యాగీ చేయాలని చూస్తుందన్నారు. టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు మల్లు రవితో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. తెలంగాణ అమరుల స్థూపానికి రూ.వంద కోట్లు వెచ్చించిన కేసీఆర్ ప్రభుత్వం.. అందులో ఒక్క అమరవీరుని పేరయినా చెక్కిందా అని ప్రశ్నించారు. చిన జీయర్ స్వామిని తీసుకువచ్చి కుర్చీలో కూర్చోపెట్టినప్పుడు, అందెశ్రీ గీతాన్ని సీమాంధ్ర గాయకుడు రామకృష్ణతో పాడించినప్పుడు, ప్రభుత్వ అంబాసిడర్లుగా రకుల్ ప్రీత్ సింగ్, మంచు లక్ష్మీ, పుల్లెల గోపీచంద్‌లను నియమించినప్పుడు, రోజా ఇంటికి వెళ్లి ఆంధ్రా బిర్యానీని తిన్నప్పుడు, పనికిరాని ఒక ప్రాజెక్టును కట్టి.. దాని ప్రారంభోత్సవానికి ఏపీ సీఎంను ఆహ్వానించినప్పుడు, శారదాపీఠానికి తెలంగాణలో భూములు ఇచ్చినప్పుడు కేసీఆర్‌కు సెంటిమెంటు గుర్తుకు రాలేదా అని ప్రశ్నించారు. కీరవాణికి ఆస్కార్ అవార్డు వస్తే.. ఇదే కేసీఆర్, కేటీఆర్ ట్విట్టర్ వేదికగా అభినందించారని గుర్తుచేశారు. ఒక మంచి గీతానికి సంగీతం సమకూర్చేందుకు కీరవాణిని సంప్రదిస్తే.. నానా యాగీ చేస్తున్నారని విమర్శించారు. కీరవాణి ఎంపిక అన్నది అందెశ్రీ ఆలోచనేనని వెల్లడించారు. మెజారిటీ ప్రజల అభిప్రాయం ప్రకారం తెలంగాణ చిహ్నం ఎంపిక జరుగుతుందన్నారు. మల్లు రవి మాట్లాడుతూ 2023 ఎన్నికలకు ముందే.. టీపీసీసీ అధ్యక్షుని హోదాలో రేవంత్‌రెడ్డి రాచరిక పాలన తీసేసి ప్రజా పాలన తీసుకువస్తామని చెప్పారని, అందులో భాగమే రాచరిక చిహ్నాల తీసివేతన్నారు. ప్రజా పాలనలో భాగంగానే జయజయహే తెలంగాణ పాటని అధికారిక గేయంగా చేస్తున్నట్లు చెప్పారు."తెలంగాణ చిహ్నంలో కాకతీయుల కళాతోరణం కావాలా...?అమరవీరుల స్థూపం వద్దా? సమ్మక్క, సారలమ్మలను చంపింది కాకతీయ రాజులు కాదా? నాతో సహా.. రాష్ట్రంలో 12% ఉన్న గిరిజనులు కాకతీయ కళాతోరణాన్ని ఎందుకు ఒప్పుకోవాలి?" అంటూ టీపీసీసీ ఆదివాసీ సెల్ చైర్మన్ బెల్లయ్య నాయక్ ప్రశ్నించారు. అందెశ్రీ రాసిన జయజయహే తెలంగాణ గేయం విషయంలో దేశపతి శ్రీనివాస్, వి. ప్రకాష్ కోడిగుడ్డుపై ఈకలు పీకే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. "అందెశ్రీ కాల్ రికార్డింగ్‌లను విడుదల చేస్తారా? ఇద్దరు వ్యక్తులు మాట్లాడుకున్న ప్రైవేటు డిస్కషన్ రికార్డును ఎలా విడుదల చేస్తారు?" అంటూ ధ్వజమెత్తారు.

పిల్లల కోసం బెంగ!

3 రోజులుగా శిశు విహార్ వద్దే పెంపుడు తల్లిదండ్రుల నిరీక్షణ

- అన్నం తింటున్నారో లేదో.. ఆరోగ్యం ఎలా ఉందో అంటూ కన్నీళ్లు
- ఒక్కసారి చూస్తాం.. లోపలికి అనుమతించండి అని వేడుకోలు
- లోపల ఉన్న 14 మంది చిన్నారుల్లో ఇద్దరు పిల్లలకు జ్వరం?
- 'కారా' రూల్స్ సడలించాలంటున్న స్వచ్ఛంద సంస్థలు
- విచారణ ముగిసేదాకా పిల్లలను చూసే అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి
- సొంత తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి.. పిల్లలను అప్పగించండి:మంత్రి సీతక్క

హైదరాబాద్ సిటీ/యూసుఫ్‌గూడ, పంజాగుట్ట, మే 31 (ఆంధ్రజ్యోతి): నవమాసాలు మోసి కనకున్నా.. ఆ పిల్లలను ఆ తల్లులు ప్రాణానికి ప్రాణంగా పెంచుకున్నారు. వారే లోకంగా బతుకుతున్నారు. అలాంటిది.. తమ వద్ద నుంచి పిల్లలను దూరంచేస్తే ఆ తల్లిండ్రులు బాధపడరా? పది నిమిషాలు కనిపించకపోతేనే తల్లడిల్లిపోయే స్థితిలో మూడు రోజులుగా పిల్లలను చూడకుండా ఉన్న ఆ తల్లిదండ్రుల ఆవేదన ఏ స్థాయిలో ఉంటుంది? ఇదంతా యూసుఫ్‌గూడలోని శిశువిహార్ పరిసరాల్లో కళ్లకు కడుతోంది. నిజమే.. సెంట్రల్ అడాప్షన్ రిసోర్స్ అథారిటీ (కారా) నిబంధనలకు విరుద్ధంగా దత్తత తీసుకొని తప్పే చేశాం అంటూ లెంపలేసుకొంటూనే.. తమ బిడ్డల్ని ఒక్కసారి చూపించండి అంటూ అధికారులను తల్లిదండ్రులు ప్రాధేయపడుతున్నారు. శిశువుల విక్రయానికి సంబంధించి అంతర్రాష్ట్రముఠా గుట్టురట్టవ్వడంతో మూడు రోజుల క్రితం వివిధ చోట్ల నుంచి 14మంది శిశువులు, చిన్నారులను పోలీసులు స్వాధీనం చేసుకొని యూసుఫ్‌గూడలోని శిశువిహార్‌లో అప్పగించారు. వీరిలో 12 మంది నెలల వయసు పిల్లలుండగా ఇద్దరు మూడేళ్లలోపు ఉన్నారు. శిశు విహార్‌లో ఉన్న తమ చిన్నారులు ఎలా ఉన్నారో? అన్నం తింటున్నారో లేదో? ఆరోగ్యం ఎలా ఉందో? అనే ఆలోచనతో పెంపుడు తల్లిదండ్రులు ఆకలిదప్పులూ పట్టకుండా బెంగటిల్లుతున్నారు. పిల్లలు వైద్యులపర్యవేక్షణలో ఉన్నా కొందరు జ్వరంతో బాధపడుతున్నట్లు తెలుస్తోంది.

దత్తత ప్రక్రియ ఆలస్యం.. సంక్లిష్టం!

పొరుగు రాష్ట్రాలతో పోల్చితే తెలంగాణ, ఏపీలో పిల్లల దత్తత ప్రక్రియలో తీవ్ర ఆలస్యం జరుగుతుంది. ఈ కారణంగానే పిల్లలు లేని దంపతులు నిబంధనలకు విరుద్ధంగా శిశువులను దత్తత తీసుకుంటున్నట్లు సమాచారం. మహారాష్ట్ర, కర్ణాటకలో దరఖాస్తు చేసుకున్న ఆరు నుంచి ఏడాదిలోపు పిల్లల దత్తత ప్రక్రియ పూర్తవుతుంది. తెలుగు రాష్ట్రాల్లో మాత్రం రెండు, మూడేళ్లు పడుతోందని స్వచ్ఛంద సంస్థల బాధ్యులు చెబుతున్నారు. పిల్లలను దత్తత తీసుకోవాలంటే తొలుత.. కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన కారా వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. తర్వాత పాన్‌కార్డు నంబర్, రెసిడెన్స్ ప్రూఫ్, ఆదాయ ధ్రువీకరణ పత్రం, వివాహ నమోదు పత్రం, దంపతుల బర్త్, హెల్త్ సర్టిఫికెట్లు సమర్పించాలి. భార్యాభర్తల పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతోపాటు ఇద్దరు కలిసి దిగిన పెళ్లి ఫొటోను కూడా దరఖాస్తుతో సమర్పించాలి. అలాగే రూ.6వేల డీడీ అప్లికేషన్ ఫారంతోపాటు రూ.40 వేలు దత్తత తీసుకునే సమయంలో సంబంధిత అనాథాశ్రమానికి లేకుంటే ప్రభుత్వ సంస్థలకు చెల్లించాలి. దరఖాస్తు చేసుకున్న అనంతరం రెండు నుంచి మూడేళ్లకు పిల్లలను దంపతులకు అప్పగిస్తారు. అప్పగించిన తర్వాత కూడా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారులు పిల్లలను పర్యవేక్షించాలి. దత్తత తీసుకున్న జంటల ఆర్థిక పరిస్థితి ఎలా ఉంది? వారు పిల్లాడిని బాగా చూసుకుంటున్నారా? లేదా? అనేవి ప్రతి ఆరు నెలలకోసారి పరిశీలించాలి. ఈ సందర్భంగా సదరు తల్లిదండ్రుల నుంచి ఆరునెలలకోసారి రూ.2వేల చొప్పున తీసుకుంటారు.

3 రోజులుగా పడిగాపులు పడుతున్నాం

నా పేరు అరుణ. భర్త పేరు సాయి. మాది ఏపీలోని చీరాల సమీపంలోని బోయనపాలెం. పిల్లలు కలగకపోవడంతో ఐదు నెలల బాబును ఓ నర్సు ద్వారా తెచ్చుకున్నాం. బాబుకు శ్రీమన్విత్ అని పేరు పెట్టుకున్నాం. మా అమ్మకు నేను ఒక్కదాన్నే కావడంతో ఆమె ఎంతో ప్రేమతో నా బాబుకు ఎకరన్నర పొలం రాసేందుకు సిద్ధమైంది. ఇంతలోనే పోలీసులు మా బాబును తీసుకొచ్చి శిశువిహార్‌లో పెట్టారు. 3 రోజులుగా ఇక్కడే ఉన్నాం. చూసేందుకు అవకాశం ఇవ్వడం లేదు. దయచేసి మా బాబును మాకు ఇప్పించండి. - అరుణ, చీరాల, ఏపీ

3 నెలల్లోపు దత్తత ఇవ్వాలి

సమాజంలో చాలా జంటలు సంతానలేమి సమస్యతో బాధపడుతున్నారు. అలాంటి వారికి పిల్లలను దత్తత తీసుకునే అవకాశాన్ని త్వరగా కల్పించాలి. కారా వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకున్నాక మూడు నెలల్లో చట్టబద్ధంగా దత్తత ప్రక్రియ పూర్తి అయ్యేలా నిబంధనలు సడలించాలి. దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టకుండా త్వరగా పరిష్కరించాలి. ప్రస్తుతం యూసుఫ్‌గూడలోని శిశువిహార్‌లో ఉంటున్న పిల్లలను చూసే అవకాశాన్ని మానవతా దృక్పథంతో తల్లిదండ్రులకు కల్పించాలి.

-డాక్టర్ మమతా రఘువీర్, తరుణి స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకురాలు

ప్రతి జిల్లాలో శిశువిహార్ పెట్టాలి



దత్తత కార్యక్రమం ఆలస్యమవుతుండడంతోనే చాలా మంది పిల్లలను అక్రమ పద్ధతిలో కొనుగోలు చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం దత్తత టైం లిమిట్ తగ్గించి సకాలంలో పిల్లలను అప్పగిస్తే దంపతులు సంతోషంగా ఉండటంతోపాటు సంరక్షణను బాధ్యతగా నెరవేరుస్తారు. ప్రభుత్వం కూడా ప్రతి జిల్లాలో శిశువిహార్ కేంద్రాలు పెట్టాలి. తద్వారా అనాథ పిల్లలకు ఆశ్రయం అందుతోంది.

-రేవతి, హైకోర్టు న్యాయవాది

పాప పేరిట ఆస్తి కూడా రాశాం



ఈ దంపతులు పేర్లు పెరుగు దుర్గాభవాని, చక్రపాణి. వీరిది ఏపీలోని బాపట్ల జిల్లా కర్లపల్లి మండలం చింతాయపాలెం. పెళ్లయి 20 ఏళ్లయినా సంతానం కలగకపోవడంతో మూడేళ్ల క్రితం విజయవాడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో నర్సు సాయంతో 8 రోజుల పాపను రూ.1.5 లక్షలకు కొనుగోలు చేశారు. అధికారులొచ్చి తమ పాపను తీసుకెళ్లడంతో శిశువిహార్ వద్ద పడిగాపులు పడుతున్నారు. పాపకు భవ్యశ్రీ అని పేరు పెట్టుకొని, మూడేళ్లుగా పెంచుకుంటున్నామని.. ప్రాణం కంటే ఎక్కువగా చూసుకున్నామని చెప్పారు. "పాప పేరిట ఆస్తిని అంతా రాశాం. మంత్రి సీతక్క ఆఫీస్ అడ్రస్ చెప్పండి సార్.. అక్కడికి వెళ్లి అమ్మను ప్రాధేయపడి పాపను తీసుకెళ్తాం" అని ఈ దంపతులు అడుగుతున్నారు.

అక్రమ రవాణాపై కఠిన చర్యలు : సీతక్క



పిల్లల అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. శుక్రవారం యూసుఫ్‌గూడలోని శిశువిహార్ కేంద్రాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా పోలీసులు స్వాధీనం చేసుకున్న చిన్నారుల ఆరోగ్య పరిస్థితిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. చిన్నారుల కుటుంబసభ్యుల వివరాలు సేకరించి, వారికి కౌన్సిలింగ్ ఇచ్చి చిన్నారులను అప్పగించాలని సూచించారు. సంతానం లేని దంపతులు ప్రభుత్వ అనుమతితో, చట్టపరంగా దత్తత తీసుకుంటే ఎలాంటి ఇబ్బందులు ఉండవని, దత్తత కోసం చట్టపరమైన ప్రక్రియను అనుసరించాలని పేర్కొన్నారు. పిల్లల అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించాలి

ఎల్లారెడ్డిపేట, మే 31: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని కాంగ్రెస్ సిరిసిల్ల నియోజక వర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ఓ టీ స్టాల్‌లో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలతో శుక్రవారం చర్చించారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ఆవిర్భావ వేడుకలను వైభవంగా జరపాలని సూచించారు. నాయకులు నర్సయ్య, గిరిధర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, బాబు, బుచ్చాగౌడ్, శ్రీనివాస్, తిరుపతి, రాంరెడ్డి, కిషన్, బాల్‌రెడ్డి ఉన్నారు.

జాతీయ స్థాయి కిక్ బాక్సింగ్‌లో కాంస్యం

సిరిసిల్ల టౌన్, మే 31 : జాతీయ స్థాయి కిక్ బాక్సింగ్‌లో జిల్లాకు చెందిన చిన్నారి యెల్లె హరిహర కాంస్య పతకం సాధించాడు. శుక్రవారం హరిహరను కిక్ బాక్సింగ్ అసోసియేషన్ జిల్లా, రాష్ట్ర సభ్యులు అభినందిం చారు. సిరిసిల్ల పట్టణం శాంతినగర్‌కు చెందిన హరిహర ఈ నెల 21 నుంచి 26 వరకు పూణెలో జరిగిన జాతీయ స్థాయి కిక్ బాక్సింగ్‌లో వయస్సు 7 నుంచి 8లోపు, బరువు 36 కిలోల లోపు కేటగిరిలో కాంస్యం అందుకున్నాడు. హరిహరను వాకో ఇండియా అధ్యక్షుడు సంతోష్ కే అగర్వాల్, తెలంగాణ కిక్ బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు రామాంజనేయులు, కార్యదర్శి మహిపాల్, జిల్లా అధ్యక్షుడు వినోద్, కార్యదర్శి శ్రీనివాస్ అభినందించారు.

అంగన్‌వాడీ సెంటర్‌లో కుళ్లిన కోడిగుడ్లు

ముస్తాబాద్, మే 31: ముస్తాబాద్ మండల కేంద్రంలోని ఓ అంగన్‌వాడీ సెంటర్‌లో కుళ్లిన కోడిగుడ్లు వచ్చాయని లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ సెంటర్‌లో రెడ్డు మార్క్‌తో ఉన్న కోడిగుడ్లను శుక్రవారం అందించారని, వాటిని చూడగా కుళ్లిపోయి ఉన్నాయని తెలిపారు. గతంలో కుళ్లిపోయి వచ్చాయని, రెండోసారి ఇలా ఇచ్చారని అనిల్ అనే వ్యక్తి తెలిపాడు. అధికారులు స్పందించి నాణ్యమైన కోడిగుడ్లు అందించాలని కోరాడు.

రవీందర్‌రావును కలిసిన ప్రజాప్రతినిధులు, నాయకులు

ఎల్లారెడ్డిపేట, మే 31: నాఫ్స్‌కాబ్ చైర్మన్ పదవికి రాజీనామా చేసిన కొండూరు రవీందర్‌రావును ఎల్లారెడ్డిపేట మండలానికి చెందిన బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు శుక్రవారం హైదరాబాద్‌లో కలిశారు. కేడీసీసీబీ చైర్మన్ నుంచి నాఫ్స్‌కాబ్ చైర్మన్ వరకు ఉన్నత పదవులు పొందిన రవీందర్‌రావు సహకార సంఘాల బలోపేతానికి కృషి చేశారన్నారు. జడ్పీటీసీ లక్ష్మణ్‌రావు, ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్ కృష్ణహరి ఉన్నారు.

ఎల్లారెడ్డిపేటలో ఐటీ అధికారుల సోదాలు?

ఎల్లారెడ్డిపేట, మే 31: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతోపాటు గొల్లపల్లి, బొప్పాపూర్‌లో ఆదాయ పన్ను శాఖ అధికారులు గురువారం రాత్రి సోదాలు నిర్వహించినట్లు సమాచారం. వ్యాపారులు, రియల్టర్లు, ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకుల ఇళ్లలో తనిఖీలు చేపట్టినట్లు తెలిసింది. సోదాల విషయం శుక్రవారం మండలంలో చర్చనీయాంశంగా మారింది.

మున్నూరు కాపు జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీగా తిరుపతి

కోనరావుపేట, మే 31 : మున్నూరు కాపు జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీగా వేల్పుల తిరుపతిని శుక్రవారం నియామకం చేసినట్లు మున్నూరు కాపు జిల్లా అధ్యక్షుడు కొండ దేవయ్య ఒక ప్రకటనలో తెలిపారు. కోనరావుపేట మండలం మలకపేట గ్రామానికి చెందిన తిరుపతి నియామకం కావడం బిజెపి నాయకులు గొట్టె రామచంద్రం, గోపాడి సురేందర్‌రావు అభినందనలు తెలిపారు.

హైదరాబాద్ తరలిన బీఆర్ఎస్ నాయకులు

గంభీరావుపేట, మే 31 : గంభీరావుపేట మండలానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు శుక్రవారం హైదరాబాద్‌కు తరలివెళ్లారు. నాఫ్స్‌కాబ్ చైర్మన్ పదవికి కొండూరు రవీందర్‌రావు రాజీనామా చేస్తుండడంతో ఇక్కడి బీఆర్ఎస్ నాయకులు భారీ ఎత్తున వెళ్లారు. రాజీనామాకు ముందు హైదరాబాద్‌లోని కార్యాలయానికి వెళ్లి కొండూరు రవీందర్‌రావును కలిశారు.

ప్రజాసేవలో ముందుండాలి

సిరిసిల్ల రూరల్, మే 31 :పదవీవిరమణ పొందినా ప్రజాసేవలో ముందుండాలని 17వ పోలీస్ బెటాలియన్ శ్రీనివాసరావు కోరారు. సిరిసిల్ల అర్బన్ పరిధిలోని సర్ధాపూర్ 17వ పోలీస్ బెటాలియన్‌లో ఆర్ఎస్సైగా పని చేస్తున్న వేణుగోపాల్ పదవీ విరమణ సందర్భంగా శుక్రవారం వేణుగోపాల్, శాంతకుమారిని సన్మానించారు.అసిస్టెంట్ కమాండెంట్ రాందాస్ పాల్గొన్నారు.

విత్తనాల ఎంపికపై రైతులకు అవగాహన

ఇల్లంతకుంట, మే 31: విత్తనాల ఎంపికలో తీసుకోవల్సిన జాగ్రత్తలపై ఇల్లంతకుంట, కేసన్నపల్లె గ్రామాల్లో శుక్రవారం సదస్సులు నిర్వహించారు. విత్తనాల కొనుగోలు సమయంలో తప్పనిసరిగా రసీదులు తీసుకోవాలన్నారు. ఏఈవో గంగ, ప్రత్యేకాధికారి శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఆటలపై ఆసక్తి పెంచుకోవాలి

ఇల్లంతకుంట, మే 31: విద్యార్థులు ఆటలపై ఆసక్తి పెంచుకోవాలని రాఘవేంద్ర ఆసుపత్రి వైద్యాధికారి గాజర్ల శరత్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలో క్రీడలలో శిక్షణ పొందుతున్న 80 మంది విద్యార్థులకు శుక్రవారం టీషర్టులు పంపిణీ చేశారు. మేనేజింగ్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మొబైల్ ఫోన్ అప్పగింత

ముస్తాబాద్, మే 31 : ముస్తాబాద్ మండల కేంద్రంలో సెల్‌ఫోన్ పోగొట్టుకున్న వ్యక్తికి శుక్రవారం పోలీసులు అప్పగించారు. మండల కేంద్రంలోని పరశురాంనగర్‌కు చెందిన ఆనందం అనే వ్యక్తి ముస్తాబాద్‌లో మొబైల్ ఫోన్ పోగొట్టుకున్నాడు. సీఈఐఆర్ అప్లికేషన్ ద్వారా వెతికి పట్టుకొని బాధితులకు అప్పగించారు. పీసీ రాజశేఖర్ తదితరులు ఉన్నారు.

రాజన్న ఆలయ ఉద్యోగి పదవీ విరమణ

వేములవాడ టౌన్, మే 31: వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో ఎలక్ట్రికల్ ఏఈ శేఖర్ శుక్రవారం పదవీ విరమణ పొందారు. ఆలయ ఈవో రామకృష్ణ తన కార్యాలయంలో శేఖర్‌ను సన్మానించారు. ఆలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు హరికిషన్, గౌరవ అధ్యక్షుడు శ్రీరాములు, కార్యదర్శి శ్రీనివాస్, ఈఈ రాజేష్, ఏఈవో ప్రతాప నవీన్, వెంకన్న ఉన్నారు.

అక్రమ నిర్మాణాన్ని తొలగించాలి

చందుర్తి, మే 31 : చందుర్తి మండలం మూడపల్లి బస్టాండ్ ప్రాంతంలోని ఒర్రెలో అక్రమంగా చేపట్టిన ఇంటి నిర్మాణాన్ని తొలగించాలని మూడపల్లి, నర్సింగాపూర్ గ్రామస్థులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఇన్‌చార్జి ఎంపీడీవో బండి ప్రదీప్‌కు ఫిర్యాదు చేశారు. గ్రామంలోని బస్టాండ్ ప్రాంతంలో లస్మయ్య అనే వ్యక్తి కోరుట్ల-వేములవాడ ప్రధాన రహదారి పక్కన ఒర్రెలో ఇంటి నిర్మాణాన్ని చేపట్టాడని, వరద నీటికి నర్సింగాపూర్ వెళ్లే రోడ్డు కోతకు గురయ్యే ప్రమాదం ఉందని అన్నారు.

సొమ్మసిల్లి పడిపోయిన నెమలి

సిరిసిల్ల క్రైం, మే 31: సిరిసిల్ల పట్టణంలోని చిన్నబోనాల శివారు పొలాల వద్ద జాతీయ పక్షి నెమలి సొమ్మసిల్లి పడిపోయింది. శుక్రవారం చూసిన రైతులు అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. అటవీశాఖ సిబ్బంది ఆలస్యంగా స్పందించారని, నెమలి తీసుకెళ్లారని, ఎక్కడికి తీసుకెళ్లారో తెలియదని తెలిపారు. వేటగాళ్ల విషప్రయోగంతో నెమలి సొమ్మసిల్లి పడిపోయినట్లు పేర్కొన్నారు. నెమలి విషయమై రైతులు అటవీశాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో ఆరా తీస్తున్నారు.

నిందితుడిని శిక్షించాలని గ్రామస్థుల ఆందోళన

- పోలీసుల తీరుపై ఆగ్రహం

ఎల్లారెడ్డిపేట, మే 31: గిరిజన బిడ్డను చంపి ఆత్మహత్యగా చిత్రీకరించిన నిందితుడిని కఠినంగా శిక్షించాల్సింది పోయి అండగా నిలుస్తారా? అంటూ గిరిజనులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వీర్నపల్లి మండలం బాబాయిచెరువు తండాలో ఈ నెల 30న అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన యువతి బానోతు మమత కుటుంబసభ్యులు, బంధువులు, తండావాసులు శుక్రవారం ఎల్లారెడ్డిపేటకు తరలివచ్చారు. సుమారు 200 మంది పోలీస్ స్టేషన్‌ను ముట్టడించారు. లోనికి చొచ్చుకెళ్లేందుకు యత్నించారు. అడ్డుకున్న పోలీసులతో వాగ్వాదానికి దిగారు. యువకుడిని తమకు అప్పగించాలంటూ పట్టుబట్టారు. పోలీస్ స్టేషన్ భవనం పైఅంతస్తులోకి దూసుకెళ్లి యువకుడి కోసం వెతికారు. అప్రమత్తమైన పోలీసులు వారిని కిందకు దింపి బయటకు పంపించారు. పోలీసుల వ్యవహారంపై అనుమానం వ్యక్తం చేస్తూ పోలీస్ స్టేషన్ ఎదుట కామారెడ్డి-సిరిసిల్ల ప్రధాన రహదారిపై రాస్తారోకో చేపట్టారు. నిరసనకారులను శాంతింపజేయడానికి ఎల్లారెడ్డిపేట రూరల్ సీఐ శ్రీనివాస్‌గౌడ్ ప్రయత్నించినా ఫలితం లేకుండాపోయింది. న్యాయం చేయాల్సింది పోయి తమ కూతురును చంపిన యువకుడిని తప్పించే ప్రయత్నం చేస్తారా? అంటూ నిలదీశారు. తమకు అప్పగించాలని భీష్మించారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో సిరిసిల్ల రూరల్ సీఐ సదన్‌కుమార్, ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి, గంభీరావుపేట, ముస్తాబాద్, తంగళ్లపల్లి ఎస్సై రమాకాంత్, రమేశ్, రాంమోహన్, శేఖర్, సుధాకర్ ఆధ్వర్యంలో పోలీసులు భారీ సంఖ్యలో మోహరించారు. డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి ఆందోళనకారులతో మాట్లాడారు. యువకుడికి శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినా వినిపించుకోలేదు. తమ కుటుంబ సభ్యులకు ప్రాణ భయం ఉందని మృతురాలి సోదరుడు గణేశ్ వాపోయాడు. న్యాయం చేయకపోతే ఇక్కడే ఉన్న విద్యుత్ స్తంభానికి ఉరేసుకుంటానని తేల్చి చెప్పాడు. తాము ఫిర్యాదు చేయకుండానే మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఎలా తరలిస్తారని ప్రశ్నించారు. దీంతో డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి బాధిత కుటుంబానికి న్యాయం చేయడంతోపాటు యువకుడికి జీవిత కాలం శిక్ష పడేలా చూస్తామని హామీ ఇవ్వడంతో శాంతించారు. బావుసింగ్‌నాయక్‌తండాకు చెందిన యువకుడు గుగులోతు సతీష్ ప్రేమ పేరిట తమ కూతురు మమతను పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసగించాడని, ఎవరూ లేని సమయంలో ఇంటికి వచ్చి చంపి ఆత్మహత్యగా చిత్రీకరించాడని, సతీష్‌తోపాటు అతడికి సహకరించిన వ్యక్తులను శిక్షించాలని యువతి తండ్రి రాందాస్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి వెల్లడించారు.



రాస్తారోకో చేస్తున్న తండావాసులు

● మృతురాలు మమత పెద్దమ్మ అంజవ్వ ఏడుస్తూ ఎండకు స్పృహ కోల్పోయి కింద పడగా బంధువులు పోలీస్ స్టేషన్ ఆవరణలోని కుర్చీలో కూర్చోబెట్టేందుకు వెళ్లారు. పోలీసులు బయటకు వెళ్లమంటూ హుకుం జారీ చేశారని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. ధర్నా చేస్తున్న తరుణంలోనూ ఆమె మళ్లీ స్పృహ కోల్పోయిన పట్టించుకోలేదని మండి పడ్డారు.



గ్రామస్థులతో మాట్లాడుతున్న డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి

బందోబస్తు మధ్య అంత్యక్రియలు

వీర్నపల్లి: పోలీసులు హామీ ఇవ్వడంతో గ్రామస్థులు ఆందోళన విరమించారు. దీంతో మమత మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. పోలీస్ బందోబస్తు మధ్య మృతదేహానికి స్వగ్రామమైన బాబాయ్ చెరువుతండాలో అంత్యక్రియలు నిర్వహించారు. గోన్యానాయక్ తండా, బాబాయ్ చెరువుతండాలో శుక్రవారం పికెట్ ఏర్పాటు చేశారు. డీఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి, సీఐ శ్రీనివాస్, ఎస్సైలు రమేష్, శేఖర్‌రెడ్డి బందోబస్తు నిర్వహించారు.

గెలుపోటములను సమానంగా స్వీకరించాలి



ప్రారంభిస్తున్న ఆది శ్రీనివాస్

వేములవాడ టౌన్, మే 31 : క్రీడల్లో గెలుపోటములను సమానంగా స్వీకరించాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్యలో నిర్వహిస్తున్న ఇంటర్‌నేషనల్ మాస్టర్ అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైన ఉమ్మడి జిల్లా క్రీడాకారుల ప్రయాణాన్ని పట్టణంలోని జూనియర్ కళాశాల ఆవరణలో జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోటీలకు ఉమ్మడి జిల్లా నుంచి 40 మంది క్రీడాకారులు ఎంపికవడం గర్వించదగ్గ విషయమన్నారు. దేశ భవిష్యత్ యువత చేతుల్లో ఉందని, చెడు వ్యసనాలకు అలవాటు పడి భవిష్యత్ నాశనం చేసుకోవద్దని సూచించారు. యువత చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణించాలని, క్రీడలతో ఆత్మవిశ్వాసం పెంపొందుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బింగి మహేష్, కాంగ్రెస్ పట్టణ ప్రధాన కార్యదర్శి కనికరపు రాకేష్ టీమ్ మేనేజర్ సత్యనారాయణరెడ్డి, మాస్టర్ అథ్లెటిక్స్ కార్యదర్శి శేఖర్, జాయింట్ సెక్రెటరీ మునీందర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి క్రీడాకారులు రామానుజమ్మ, శంకర్, అబ్దుల్ పఠాన్, లక్ష్మణ్, కమల్, జవ్వాజీ లక్ష్మణ్ ఉన్నారు.

ఆశావర్కర్ల జీవితాలతో ఆడుకోవద్దు

సిరిసిల్ల కలెక్టరేట్, మే 31 : ఆశావర్కర్లకు పరీక్షలు పెట్టే నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని, వారి జీవితాలతో వాడుకోవద్దని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆశావర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం సీఐటీయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో ఏవో రాంరెడ్డికి వినతపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ ఆశావర్కర్లపై గత ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందన్నారు. కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరిస్తుందని ఎదురు చూస్తుండగా కొత్త సమస్యలు తెచ్చి పెడుతోందన్నారు. ప్రజల ఆరోగ్యం కాపాడడం కోసం వారి ఆరోగ్యాలను సైతం లెక్కచేయకుండా ఆశవర్కర్లు అనేక రకాల సేవలందిస్తున్నారన్నారు. కరోనా సమయంలో ఆశావర్కర్లు తమ ప్రాణాలను సైతం ఫణంగా పెట్టి ఫ్రంట్ లైన్ వారియర్స్‌గా పని చేశారన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఆశావర్కర్లకు నష్టం కల్గించే విధానాలను మానుకోవాలని, పరీక్షలు పెట్టే నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని అన్నారు. ఆశావర్కర్లకు పారితోషకాలు కాకుండా పెరుగుతున్న ధరలకు అనుగుణంగా నెలకు రూ. 18వేలు ఫిక్స్‌డ్ వేతనాన్ని అందించాలన్నారు. పని భారం తగ్గించి జాబ్‌చాట్ ప్రకటించాలన్నారు. గత ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం ప్రమాదబీమా సౌకర్యంతోపాటు పదవీవిరమణ పెన్షన్‌లకు సంబంధించిన సర్క్యులర్లు జారీ చేయాలన్నారు. అర్హత కల్గిన ఆశాలకు ఏఎన్ఎం, జీఎస్ఎం పోస్టులలో ప్రాధాన్యం కల్పించే విధంగా వెయిటేజీ మార్కులు నిర్ణయించాలన్నారు. పెండింగ్ బకాయిలను అందించాలని, పారితోషకాలు లేని పనులను ఆశాలతో చేయించకూడదని అన్నారు. వివిధ రకాల సర్వేలు, డ్యూటీలకు సంబంధించి ఆశాలకు రావాల్సిన టీఏడీఏలను అందించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో ఇటీవల పార్లమెంట్ ఎన్నికల్లో డ్యూటీలు చేసిన అశావర్కర్లకు డబ్బులు ఇవ్వలేదన్నారు. చాలా జిల్లాలో ఎన్నికల డ్యూటీకి సంబంధించిన ఆశావర్కర్లకు డబ్బులు ఇచ్చారన్నారు. కలెక్టర్ స్పందించి ఆశా వర్కర్స్ యూనియన్ ప్రతినిధులతో చర్చలు జరపాలని, స్థానికంగా పెండింగ్ సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆశావర్కర్ల సమస్యల పరిష్కారం కోసం జూన్ 13న కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు. జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి, ఎలిగేటి రాజశేఖర్, రుచిత, లావణ్య, నందిని, లత తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

ఎల్లారెడ్డిపేట, మే 31: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని స్థానిక కాంగ్రెస్ నాయకులు, ఆలయ కమిటీ, దూదేకుల సంఘం సభ్యులు వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను కోరారు. శుక్రవారం వేములవాడలోని ఆయన నివాసంలో వినతి పత్రం అందజేశారు. మండల కేంద్రంలోని వేణుగోపాలస్వామి ఆలయానికి చెందిన వ్యవసాయ భూమిలో బోరు వేయించాలని, సాగు నీటి సౌకర్యం కల్పించడంతోపాటు ఆలయ పునర్నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని విన్నవించారు. గ్రామ పంచాయతీ పరిధిలోని కిష్టంపల్లి, కేసీఆర్ నగర్ కాలనీలో రేషన్ దుకాణాలను ఏర్పాటు చేయించాలని కోరారు. శుద్ధనీటి కేంద్రాన్ని మంజూరు చేసి ప్రజల దాహార్తిని తీర్చాలని పేర్కొన్నారు. దూదేకుల సంఘం భవన నిర్మాణంతోపాటు బోరు మోటారుకు నిధులను కేటాయించాలని విన్నవించారు. స్పందించిన ఆయన నిధుల మంజూరుకు కృషి చేసి సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని నాయకులు పేర్కొన్నారు. నాయకులు బాలరాజుయాదవ్, సంతోష్‌గౌడ్, జితేందర్, వెంకటేశ్‌గౌడ్, సత్తార్, దర్వేశ్, గౌస్, ఖాజామొయినుద్దీన్ తదితరులు ఉన్నారు.



వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

డ్రైనేజీ నిర్మాణంతో తొలగనున్న వరదనీటి ముప్పు



ఇల్లంతకుంటలో నిర్మించిన డ్రైనేజీ

ఇల్లంతకుంట, మే 31: వర్షాకాలం వచ్చిందంటే చాలు వరదనీరు ఇంట్లోకి రావడంతో ప్రజలు ఇబ్బంది పడడం మండలకేంద్రంలో అనేక సంవత్సరాలుగా కొనసాగుతోంది. వరదనీటి ముప్పును తొలగించాలనే లక్ష్యంతో మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ నూతనంగా డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలని నిర్ణయించారు. ఉపాధిహామీ నిధుల కింద రూ.38.50లక్షలతో మండల పరిషత్ కార్యాలయ సమీపం నుంచి డ్రైనేజీ నిర్మాణం చేపట్టారు. మండలకేంద్రంలోని బస్టాండ్ ఎగువ ప్రాంతంలో కుమ్మరికుంట ఉండగా దీనికి గండికొట్టి ప్రభుత్వ కార్యాలయాలు నిర్మించారు. వర్షాకాలంలో కుమ్మరికుంటలోకి వచ్చే వరద నీటి విషయాన్ని పట్టించుకోలేదు. దీంతో 35 ఏళ్లుగా వరదనీరు బస్టాండ్ ప్రాంతానికి రావడం ఇళ్లు, వ్యాపార సంస్థల్లోకి పోవడం ఏటా తీవ్రంగా నష్టపోతున్నారు. దీనిని గుర్తించిన స్థానిక నాయకులు సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీంతో డ్రైనేజీ నిర్మాణం చేపట్టారు. ఈ సంవత్సరం వర్షాకాలంలో వరదనీటి ఇబ్బందులు తొలగిపోయినట్లేనని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. డ్రైనేజీ నిర్మాణానికి కృషిచేసిన ఎమ్మెల్యే, స్థానిక నాయకులకు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

కాంగ్రెస్ జిల్లా సెక్రెటరీగా శ్రీనివాస్‌రెడ్డి

తంగళ్లపల్లి, మే 31: జిల్లా కాంగ్రెస్ కార్యదర్శిగా తంగళ్లపల్లి మండలం బస్వాపూర్‌కు చెందిన సత్తు శ్రీనివాస్ రెడ్డిని నియమిస్తూ పార్టీ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఉత్తర్వులు జారీ చేశారు. శుక్రవారం సత్తు శ్రీనివాస్‌రెడ్డికి నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. తన నియామకానికి సహకరించిన మహేందర్ రెడ్డి, తంగళ్లపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రవీణ్, కాంగ్రెస్ నాయకులు చక్రధర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. నాయకులు వైద్య శివప్రసాద్, పూర్మాణి లింగారెడ్డి, గోనే ఎల్లప్ప, గుగ్గిళ్ల భరత్‌గౌడ్, మల్లేశం తదితరులు ఉన్నారు.

సెస్ కార్యాలయం వద్ద వినియోగదారుడి నిరసన

ఎల్లారెడ్డిపేట, మే 31: పలుకుబడి కల్గిన వ్యక్తుల బకాయిలను వసూలు చేయకుండా కొద్దిపాటి బకాయి ఉన్న తన విద్యుత్ కనెక్షన్‌ను సెస్ అధికారులు తొలగించడంపై ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన వినియోగదారుడు సంతోష్ శుక్రవారం ఆ శాఖ కార్యాలయం వద్ద కూర్చొని మౌన నిరసన చేపట్టాడు. పలుకుబడి ఉన్న వ్యక్తులు బకాయిలు చెల్లించకున్నా పట్టించుకోవడం లేదని వాపోయాడు. రెండు, మూడు నెలల విద్యుత్ బిల్లు చెల్లించకపోతే సరఫరాను నిలిపివేశారని ఆవేదన వ్యక్తం చేశాడు. అధికారులు స్పందించి తనకు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని, అప్పటి వరకు కదలబోనని భీష్మించాడు. స్పందించిన అధికారులు ఉన్నతాధికారుల ఆదేశాలతో బకాయిలు వసూలు చేస్తున్నామని, బకాయి ఉన్న వారి విద్యుత్ కనెక్షన్లు తొలగిస్తున్నామని వివరించారు. కొంత గడువు ఇస్తున్నామని ఆ లోగా బకాయి చెల్లించాలని వినియోగదారుడు సంతోష్‌కు సూచించడంతో నిరసన విరమించాడు.

ఉపాధి కూలీలకు ఆర్థిక సహాయం

కోనరావుపేట, మే 31 : కోనరావుపేట మండలం వెంకట్రావుపేటలో ఉపాధి హామీ పనులు జరుగుతున్న చోట ప్రమాదానికి గురై ఒకరు మృతి చెందగా మరో ఆరుగురు గాయపడ్డారు. శుక్రవారం బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ ఆర్థిక సహాయాన్ని అందజేశారు. మృతి చెందిన మారుపాక దేవవ్వకు రూ.10 వేలు, గాయపడిన ఆరుగురు కూలీలకు ఒక్కొక్కరికి ఐదు వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు గొట్టే రామచంద్రం, గోపాడి సురేందర్‌రావు, పల్లం అన్నపూర్ణ మిరియాల్‌కార్ బాలాజీ, సురేష్, మోహన్, వెలిశాల రవి, తిరుపతి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ది ప్రజాపాలన

ఎల్లారెడ్డిపేట, మే 31: పోరాడి సాధించుకున్న తెలంగాణలో పదేళ్లు బీఆర్ఎస్ ప్రభుత్వం రాచరిక పాలనను సాగించిందని, ప్రజలు మార్పు కోరుకోవడంతో అధికారంలో వచ్చిన కాంగ్రెస్ ప్రజా పాలన కొనసాగిస్తోందని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అమరవీరుల త్యాగాలకు రాష్ట్ర చిహ్నంలో గుర్తింపు ఇవ్వాలనే లక్ష్యంతో తమ ప్రభుత్వం యోచిస్తోందన్నారు. నాయకులు లక్ష్మారెడ్డి, లింగాగౌడ్, గిరిధర్‌రెడ్డి, బుచ్చాగౌడ్, బాబు, శ్రీనివాస్, తిరుపతి, కిషన్, బాల్‌రెడ్డి, రఫీక్, రాజు పాల్గొన్నారు.

అధికారులను ఆశ్రయించిన మహిళా రైతు

బోయినపల్లి, మే 31: డ్రిప్ పరికరాలు అందించకపోవడంతో తాను రూ.30 లక్షల మేరకు నష్టపోయినట్లు బోయినపల్లి మండలం మర్లపేటకు చెందిన మహిళా రైతు శుక్రవారం వినియోగదారుల ఫోరాన్ని ఆశ్రయించింది. గత ప్రభుత్వ హయాంలో అధికారులు పంట మార్పిడి చేయాలని రైతులను ప్రోత్సహించగా మర్లపేటకు చెందిన మహిళా రైతు భీంరెడ్డి విజయ తన 8 ఎకరాల్లో చెరకు పంటను సాగు చేశారు. డ్రిప్ పరికాల కోసం హార్టికల్చర్ శాఖకు దరఖాస్తు చేసుకొని జైన్ ఇరిగేషన్ సంస్థకు రైతు వాటా కింద రూ.1.14 లక్షలను సైతం 2022లో చెల్లించింది. అప్పటి నుంచిడ్రిప్ పరికరాలు రాకపోవడం, ఆశించిన దిగుబడి లేకపోవడంతో రూ.30 లక్షల మేరకు నష్టపోయినట్లు సదరు రైతు విజయ వినయోగదారుల ఫోరాన్ని ఆశ్రయించారు. రాష్ట్ర హార్టికల్చర్ అధికారికి, కలెక్టర్, జిల్లా ఉద్యాన అధికారికి, జైన్‌ఇరిగేషన్ సంస్థకు అడ్వకేట్ ద్వారా నోటీసులు పంపినట్లు తెలిపారు.

మండల పరిషత్‌లో రికార్డుల తనిఖీ

బోయినపల్లి, మే 31: బోయినపల్లి మండల పరిషత్ కార్యాలయంలోని రికార్డులను జడ్పీ సీఈవో ఉమారాణి శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జడ్పీ సీఈవోతో పాటు సిబ్బంది వివిధ రికార్డులను పరిశీలించారు. వారి వెంట డిప్యూటీ సీఈవో గీత ఉన్నారు.

పీసీసీ లీగల్ సెల్ కన్వీనర్‌గా ఇనయతుల్లా

కోనరావుపేట, మే 31 : కోనరావుపేట మండలం కనగర్తి గ్రామానికి చెందిన మహమ్మద్ ఇనయతుల్లా పీసీసీ లీగల్ సెల్ కన్వీనర్‌గా నియామకం కావడంపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. ఎంఏ ఎల్ఎల్ఎమ్ చదివి రాష్ట్ర ఉర్దూ అకాడమీ మెంబర్ బోర్డు గవర్నర్ స్పిన్నెడ్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా విద్యావంతుల వేదికలో పనిచేశాడు. ప్రస్తుతం హైకోర్టు న్యాయవాదిగా కొనసాగుతున్న ఇనయతుల్లా పీసీసీ లీగల్ సెల్ కన్వీనర్‌గా నియామకం కావడంపై ప్యాక్స్ వైస్ చైర్మన్ అనుపాటి భూంరెడ్డి హర్షం వ్యక్తం చేశారు.


రాష్ట్ర గీతంపై మాట్లాడే హక్కు లేదు



సిరిసిల్లలో మాట్లాడుతున్న కేకే మహేందర్‌రెడ్డి

సిరిసిల్ల టౌన్, మే 31: జయ జయహే తెలంగాణ గీతాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్రగీతంగా ఆమోదించడాన్ని స్వాగతిస్తున్నామని, రాష్ట్ర గీతంపై మాట్లాడే నైతిక హక్కు నాటి టీఆర్ఎస్ నేటి బీఆర్ఎస్ నాయకులకు లేదని కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సిరిసిల్ల పట్టణం కాంగ్రెస్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ ఉద్యమ సమయంలో జయజయహే తెలంగాణ గీతాన్ని ఉపయోగించుకున్న బీఆర్ఎస్ నాయకులు రాష్ట్రం సాధించుకున్న తరువాత ఆ గీతాన్ని పక్కన బెట్టారని, ఇప్పుడు మాట్లాడడం సిగ్గు చేటని అన్నారు. తెలంగాణ రాష్ట్ర సమితి నుంచి రాజకీయ లబ్ధికోసం భారత రాష్ట్ర సమితిగా మార్చుకొని తెలంగాణ రాష్ట్ర గీతంపై మాట్లాడేవారు సిగ్గుతో తలదించుకోవాలన్నారు. అధికారం కోల్పోయాక కేసీఆర్, కేటీఆర్, హరీష్‌రావుకు మతిస్థిమితం లేక పిచ్చి పిచ్చిగా మాట్లాడుతున్నారన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో జయహే తెలంగాణ పాటను ఎవరు పాడారు, బతుకమ్మ పాటలకు సంగీతం ఎవరితో చేయించారో తెలుసుకోవాలన్నారు. కేసీఆర్, కేటీఆర్, హరీష్‌రావుకు దోచుకొని దాచుకోవడం కోసం తెలంగాణపైన ప్రేమ ఉందని ఆరోపించారు. తెలంగాణ ప్రజల జీవన విధానాల ఆధారంగా రాజముద్రలు (ప్రభుత్వ చిహ్నాలు)ఉంటాయన్నారు. ఓరుగల్లు సామ్రాజ్యం, చార్మినార్ పాటలోనే ఉందని తెలంగాణ చరిత్రను కేసీఆర్ వక్రీకరించారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, ప్రధాన కార్యదర్శి మ్యాన ప్రసాద్, సిరిసిల్ల బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సూర దేవరాజు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, మహిళ జిల్లా అధ్యక్షురాలు కామిని వనిత, కౌన్సిలర్ కుడికాల రవికుమార్, మాజీ కౌన్సిలర్ ఆడెపు చంద్రకళ, నాయకులు కత్తెర దేవదాస్, వైద్య శివప్రసాద్, శ్రీకాంత్‌గౌడ్, వెంకటస్వామి, రోజా, శ్రీశైలం, కోడం శ్రీనివాస్, పాల్గొన్నారు.

పోచమ్మ బోనాలు



బోనాలతో వెళ్తున్న మహిళలు

చందుర్తి, మే 31 : చందుర్తి మండల కేంద్రంలో మున్నూరు కాపు కులస్తులు శుక్రవారం గ్రామ దేవత పోచమ్మ బోనాలు నిర్వహించారు. ప్రతీ ఇంటి నుంచి బోనాన్ని ఎత్తుకొని మహిళలు ఆలయానికి బయల్దేరారు. అనంతరం అమ్మవారికి నైవేద్యాన్ని సమర్పించారు. పోతురాజుల విన్యాసాలు, యువకుల కేరింతల మధ్య బోనాల ఊరేగింపు నిర్వహించారు. వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ బోనాల వేడుకల్లో పూజలు నిర్వహించారు. సంఘం అధ్యక్ష, కార్యదర్శులు లోలపు శేఖర్, రాచర్ల రాంప్రసాద్, నాయకులు దారం రామచంద్రం, పొంచెట్టి రాకేష్, లింగయ్య, పొంచెట్టి చంద్రయ్య, రవీందర్, అంజయ్య, మధు, నాగరాజు, రవి, దారం నర్సయ్య, పొంచెట్టి నర్సయ్య, వేణు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంపై బీసీలకు విశ్వాసం



సమావేశంలో మాట్లాడుతున్న పర్శ హన్మండ్లు

సిరిసిల్ల టౌన్, మే 31 : రాష్ట్రంలో కులగణన చేసి రిజర్వేషన్లను కాంగ్రెస్ ప్రభుత్వం పెంచుతుందనే విశ్వాసం బీసీలకు ఉందని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మండ్లు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని బీసీ భవన్‌లో బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో స్థానిక సంస్థల ఎన్నికలు, బీసీ రిజర్వేషన్ల పెంపు, భవిష్యత్ కార్యాచరణ అంశాలపై బీసీ కుల సంఘాల నాయకులతో జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ముఖ్యమంత్రి కేసీఆర్ బీసీ రిజర్వేషన్లు తగ్గించి రాజకీయంగా బీసీల గొంతు కోశారన్నారు. బీసీ కులగణను చేపట్టి బీసీ రిజర్వేషన్లు పెంచుతామని కాంగ్రెస్ మేనిఫెస్టోలో పేర్కొనడం, ఏఐసీసీ మాజీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ మొన్నటి ఎన్నికల బహిరంగ సభలోనూ హామీ ఇచ్చారని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఏకగ్రీంగా తీర్మానం చేయడం, జీవో నంబరు 26ను తీసుకొచ్చి రూ. 150 కోట్లు బడ్జెట్ కేటాయించడం హర్షనీయమన్నారు. ఎన్నికల కోడ్ జూన్ 4తో ముగియగానే రాజ్యాంగబద్ధంగా కమిషన్ ఏర్పాటు చేసి సమగ్ర కులగణను చేపట్టాలని కోరారు. బీసీ రిజర్వేషన్లు పెంచిన తరువాతే స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం చేపట్టే నామినేటెడ్ పోస్టులు వైస్ చాన్సలర్ పదవుల్లో జనాభా దామాషా ప్రకారం 50 శాతం కోటా ఇవ్వాలన్నారు. జనాభా దామాషా ప్రకారం వాటా దక్కాలంటే బీసీలంత సంఘటితంగా ముందుకు సాగాలన్నారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం, వివిధ కుల సంఘాల నాయకులు తడుక కమలాకర్, కంచర్ల రాజు, గాజుల సాగర్, ప్రసాద్, అంజయ్య, తిరుపతి, విజయ్, భాస్కర్, ప్రభాకర్, శ్రీకాంత్, శ్రీధర్ పాల్గొన్నారు.